గురువారం
05-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 76
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఏలూరు కాలువ వరద ప్రభావంతో నీటమునిగిన గన్నవరం నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలు

కన్నీటి వ్యథ

- నాలుగు రోజులుగా ముంపులోనే
- బంధువుల ఇళ్లకు పయనం
- బుడమేరు గండ్ల కలకలం
- ఈలప్రోలు, రైల్వే బ్రిడ్జి దగ్గర గండ్లు
- పూడ్చివేతకు చర్యలు
- ఐదు గ్రామాలకు రాకపోకల బంద్

2లో

ఊర్మిళానగర్‌లో...

సింగ్‌నగర్‌లో...

మిల్క్‌ప్రాజెక్ట్ వద్ద వరద ప్రవాహం

కాంగ్రెస్ గూటికి వినేశ్, పునియా

కండువా కప్పి ఆహ్వానించిన రాహుల్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హత వేటుకు గురైన స్టార్ మహిళా రెజ్లర్ వినేష్ ఫొగాట్ రాజకీయ రంగ ప్రవేశంపై ఉత్కంఠ వీడింది. అందరి అంచనాలకు తగినట్లే ఆమె రాజకీయ అరంగేట్రం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిశారు. ఆమె వెంట మరో రెజ్లర్ బజరంగ్ పునియా ఉన్నారు. వీరిద్దరు రాహుల్‌తో సమావేశమై రాజకీయాల పట్ల తమకున్న ఆసక్తిని వ్యక్తం చేశారు. అనంతరం రాహుల్ సమక్షంలో

- మిగతా 2 లో

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇస్తాం: రాహుల్

జమ్మూ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం జమ్మూ కాశ్మీర్‌లో తన పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇండియా ఐక్య సంఘటన భాగస్వాముల సహాయంతో తమ పార్టీ కేంద్ర పాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదాను పునరుద్ధరించేలా చూస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. వచ్చే నెలలో తమ పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత విశ్వాసం వ్యక్తం చేశారు. సెప్టెంబరు 18, 25, అక్టోబరు 8 తేదీల్లో మూడు దశల్లో జరగనున్న జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల కోసం నేషనల్ కాన్ఫరెన్స్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. గతంలో రాష్ట్రాన్ని రెండు కేంద్ర

- మిగతా 2 లో

కోల్‌కతా హత్యాచార ఘటన...

మాజీ ప్రిన్సిపల్‌పై దాడికి యత్నం

కోల్‌కతా: ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలి పై హత్యాచార ఘటనకు సంబంధించి సీబీఐ అరెస్టు చేసిన వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను కోర్టు ముందు హాజరు పరిచారు. అయితే సందీప్ ఘోష్‌ను కోర్టుకు తీసుకువెళ్లిన సమయంలో అక్కడ ఉన్న వారు అతడిపై దాడి చేయడానికి ప్రయత్నించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఇదీ లోకం!

బురద జల్లుదామనే వెళ్ళాను, కానీ జనం నాకే బురద అంటించారు.

మరో ముప్పు!

- ఉపరితల ఆవర్తన ప్రభావం
- కోస్తాంధ్రకు భారీ వర్ష సూచన
- ఐఎండీ హెచ్చరిక... జనం బెంబేలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వందేళ్ల చరిత్రలో ఎన్నడూలేనంత ఉపద్రవం నుంచి బెజవాడ ప్రజలు ఇంకా తేరుకోకముందే వాతావరణశాఖ మళ్లీ పిడుగులాంటి వార్త చెప్పింది. మరో ముప్పు పొంచి ఉందంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఏపీకి మరలా భారీ వర్ష సూచన ఉందని ప్రకటించింది. పశ్చిమ, వాయువ్య బంగాళాఖాతం అనుకొని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. గురువారానికి అల్పపీడనంగా ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా.. పల్నాడు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అల్పపీడనం ప్రభావంతో తీరం వెంబడి భారీ ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ

- మిగతా 2 లో

అందరి భాగస్వామ్యం అవసరం

- తక్షణ సాయంగా రూ.20 వేలు
- వాణిజ్య పంటలకు రూ. లక్ష ఇవ్వాలి
- వరద ప్రాంతాల సందర్శనలో రామకృష్ణ డిమాండ్

6లో

వరద విపత్తును జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలని, వరద సహాయక చర్యల్లో అన్ని రాజకీయ పార్టీలను ముఖ్యమంత్రి భాగస్వామ్యం చేయాలని, వరద బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.20 వేలు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు.

నేడు రాష్ట్రానికి కేంద్ర బృందం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో వరద ప్రభావిత కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు తదితర జిల్లాల్లో 5వ తేదీ గురువారం కేంద్ర బృందం పర్యటించనుంది. కేంద్ర హోంశాఖ అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్ జిందాల్ నేతృత్వంలో కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి స్వయంగా వరద నష్టాన్ని పరిశీలించడంతో పాటు వరద బాధితులతో నేరుగా మాట్లాడనుంది. కేంద్ర బృందంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) సలహాదారు కల్నల్ కేపీ సింగ్, కేంద్ర జలసంఘం డైరెక్టర్ సిద్ధార్థ్ మిత్రా, కేంద్ర జలసంఘం హైదరాబాదు ఎస్‌ఈ (కేసీసీ) ఎం.రమేశ్ కుమార్, ఎన్‌డీఎస్‌ఏ సదరన్ జోన్ చెన్నైకి చెందిన డైరెక్టర్ ఆర్.గిరిధర్, ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ వివియన్ ప్రసన్న ఉన్నారు.

సహాయ చర్యలు ముమ్మరం

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం
- వరద బాధితులకు 25 కిలోల బియ్యం, నిత్యవసరాలు
- అమరావతి మునిగిపోతుందంటూ దుష్ప్రచారం
- విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. బాధితులకు ఎలాంటి అవసరం వచ్చినా...తాము అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. విజయవాడలోని ఎన్టీఆర్‌జిల్లా కలెక్టరేట్ దగ్గర బుధవారం సీఎం విలేకరులతో మాట్లాడారు. వరద ముంపు ప్రాంతాల్లో బురద తొలగింపు పనులు ప్రారంభమయ్యాయని, 62 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు చంద్రబాబు చెప్పారు. 2,100 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఏర్పాటు చేసినట్లు, 100కుపైగా ఫైరింజన్లు సహాయక చర్యల్లో పాల్గొన్నాయని వివరించారు. ప్రొక్లెయిన్లు, టిప్పర్ల ద్వారా వేస్టేజ్‌ను తరలిస్తున్నామని, సహాయక చర్యల్లో 32 మంది ఐఏఎస్‌లు పనిచేస్తున్నారని, 179 మంది సచివాలయాలకు 179 మంది సీనియర్ అధికారులను ఇన్‌చార్జులుగా పెట్టామని తెలిపారు. ఎవరైనా చనిపోతే మృతదేహాలను బంధువులకు అప్పగిస్తున్నామని, మృతుల కుటుంబాలకు రూ. 5లక్షల పరిహారం అందించాలని ఆదేశించారు. ఇప్పటివరకు బాధితులకు 6లక్షల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశామని, 8.50 లక్షల వాటర్ బాటిళ్లు, 3లక్షల లీటర్ల పాలు, 5లక్షల బిస్కెట్ ప్యాకెట్లు అందించామన్నారు. 5లక్షల

- మిగతా 2 లో

షాట్‌పుట్‌లో రజతం

పారాలింపిక్స్‌లో మెరిసిన సచిన్ ఖిలారీ

భారత్ ఖాతాలో 21వ పతకం

పారిస్: పారాలింపిక్స్ 2024లో భారత ఆటగాళ్ల ప్రదర్శన రికార్డు స్థాయిలో కొనసాగుతోంది. పోటీలు మొదలై 7వ రోజుకి చేరుకున్నాయి.. భారత్‌కు బుధవారం 21వ పతకం లభించింది. పురుషుల షాట్‌పుట్ ఎఫ్46 విభాగంలో సచిన్ ఖిలారీ దేశానికి రజత పతకాన్ని అందించాడు. ఖిలారీ అత్యుత్తమంగా 16.32 మీటర్లు విసిరి విజేతగా నిలిచాడు. అయితే సచిన్ పసిడి పతకం గెలుచుకునే అవకాశాన్ని కేవలం 0.06 మీటర్ల తేడాతో కోల్పోయాడు. పురుషుల షాట్‌పుట్ ఎఫ్46 విభాగంలో ఫైనల్‌లో

- మిగతా 2 లో

ఏ బ్యాంక్ నుంచైనా పెన్షన్

ఈపీఎస్ పింఛన్‌దారులకు శుభవార్త

న్యూఢిల్లీ: ఈపీఎస్ పింఛన్‌దారులకు కేంద్రం శుభవార్త తెలిపింది. దేశంలోని ఎక్కడి నుంచైనా ఏ బ్యాంక్ నుంచైనా పెన్షన్ తీసుకునేందుకు వీలు కల్పించింది. ఈ మేరకు సెంట్రలైజ్డ్ పెన్షన్ పేమెంట్ సిస్టమ్ తీసుకొచ్చేందుకు ఈపీఎఫ్ ఆమోదం తెలిపినట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి, ఈపీఎఫ్ ట్రస్టీబోర్డ్ ఛైర్మన్ మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు. 2025 జనవరి 1 నుంచి ఈ సదుపాయం అందుబాటులోకి రానుందని తెలిపారు. దీనివల్ల 78 లక్షల మంది పింఛన్‌దారులకు ప్రయోజనం కలగనుందని చెప్పారు. ఈపీఎఫ్ఓ ఆధునికీకరణలో సెంట్రలైజ్డ్ పేమెంట్ సిస్టమ్ కీలక మైలురాయని మాండవీయ పేర్కొన్నారు. పింఛన్‌దారులు ఏళ్లుగా చేస్తున్న డిమాండ్‌కు దీంతో పరిష్కారం లభిస్తుందని చెప్పారు. దీనివల్ల పెన్షనర్లు దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా ఏ బ్యాంక్‌కు చెందిన ఏ శాఖ నుంచైనా పింఛన్ పొందే వీలుంటుందన్నారు. పింఛన్‌దారులు ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వెళ్లినప్పుడు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ బదిలీ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. దీంతో పాటు ఏదైనా బ్యాంక్ లేదా శాఖ మార్చుకోవాల్సిన సందర్భంలోనూ ఈ సదుపాయం ఉపయోగపడనుంది. ప్రస్తుత పెన్షన్ పంపిణీ వ్యవస్థలో సీపీపీఎస్ సమూల మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ప్రస్తుతం

- మిగతా 2 లో

వైసీపీ నేతలకు చుక్కెదురు

టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో ముందస్తు బెయిల్‌కు హైకోర్టు నిరాకరణ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం, సీఎం చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసుల్లో వైసీపీ నేతలకు చుక్కెదురైంది. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన నేతలకు నిరాశ ఎదురైంది. బుధవారం హైకోర్టులో ఈ పిటిషన్ విచారణకు రాగా... బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం తిరస్కరించింది. హైకోర్టు ఉత్తర్వులను రెండు వారాల పాటు సస్పెండ్ చేసి... తమకు సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలని వైసీపీ నేతల తరఫు న్యాయవాదులు కోరారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు ఉందని వైసీపీ నేతల తరపు న్యాయవాదులు తెలిపారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు అలా లేదని టీడీపీ న్యాయవాదులు వాదించారు. అన్నింటినీ పరిశీలించిన హైకోర్టు తుది ఉత్తర్వులు తొలుత మధ్యాహ్నం ఇస్తామని పేర్కొంది. అనంతరం ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ తీర్పు చెప్పింది. 2021 అక్టోబరు 19న జరిగిన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకలు దాడికి పాల్పడ్డాయి. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పోలీసులు తూతూమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ కేసుపై దృష్టి సారించారు. ఈ ఘటనపై మంగళగిరి రూరల్

- మిగతా 2 లో

బెస్ట్ సెల్లర్‌గా ట్రంప్ పుస్తకం 'సేవ్ అమెరికా'

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఆయన కొత్త పుస్తకం 'సేవ్ అమెరికా' కూడా దూసుకుపోతోంది. విడుదలైన కొద్దిగంటల్లోనే అమెజాన్ బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. 92.06 డాలర్ల భారీ ధర ఉన్నప్పటికీ అమెజాన్‌లో 'ప్రెసిడెంట్స్ అండ్ హెడ్స్ ఆఫ్ ది స్టేట్ బయోగ్రఫీస్' జాబితాలో తొలిస్థానంలో నిలిచింది. మొత్తంగా 13వ స్థానంలో ఉంది. అధ్యక్షుడిగా తన పదవీకాలం, ప్రచార సమయంలోని విశేషాలను పుస్తకంలో ట్రంప్ పొందుపరిచారు. జులైలో పెన్సిల్వేనియాలోని బట్లర్ పట్టణంలో ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ ప్రసంగిస్తుండగా ఓ యువకుడు కాల్పులు జరపడం, రక్తమోడుతున్న గాయంతో ఒక్కక్షణం నిర్ఘాంతపోయిన ట్రంప్... ఆ వెంటనే తేరుకొని వేదికపై పిడికిలి బిగించి, ఫైట్ అంటూ నినదిస్తున్న సమయంలో తీసిన ఫొటో నెట్టింట్లో విపరీతంగా చక్కర్లు కొట్టింది. ఆ దృశ్యాన్నే ఆయన కవర్ పేజ్‌పై వాడారు. అప్పటి జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, ఉత్తరకొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్‌తో ఉన్న ఫొటోలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు అంతర్జాతీయ మీడియా కథనం పేర్కొంది. అలాగే మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్‌పై విమర్శలు, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీని సమర్థించుకోవడం ఇందులో కనిపిస్తుందని తెలిపింది. తన గత పదవీకాలంతో పాటు మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికైతే ఎలాంటి పాలన అందించాలని ఆయన యోచిస్తున్నారో ఈ పుస్తకంలో పేర్కొన్నారు. 'సేవ్ అమెరికా'లో తన తొలిపాలనకు సంబంధించిన ముఖ్యఘట్టాలు పొందుపరిచారు. పన్నులు, అంతర్జాతీయ దౌత్యం, సరిహద్దు భద్రత వంటి అంశాలను ప్రస్తావించారని అమెజాన్ వెల్లడించింది. ఈ పుస్తకం గురించి తన సోషల్ మీడియా యాప్ 'ట్రూత్'లో ట్రంప్ ప్రమోట్ చేసుకున్నారు. అందులో పొందుపరిచిన ప్రతిఫొటోను తానే ఎంపిక చేసినట్లు చెప్పారు. దేశభక్తులు ఈ చరిత్ర తెలుసుకోవడం తప్పనిసరనే అర్థంలో పోస్టు పెట్టారు.

నైజీరియాలో మారణకాండ

బొకోహరమ్ ఉగ్రవాదుల చేతిలో 100 మందికి పైగా హతం

అబూజా: సుదీర్ఘకాలంగా ఉగ్రవాద దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆఫ్రికా దేశం నైజీరియాలో మరో ఘోరం చోటుచేసుకుంది. ఈశాన్య రాష్ట్రం యోబేలో బొకోహరమ్ మిలిటెంట్లు గ్రామాలపై విరుచుకు పడ్డారు. కనిపించిన వారందరినీ కాల్చిచంపారు. ఈ కిరాతక దాడుల్లో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు. యోబేలోని తర్మువా కౌన్సిల్ ప్రాంతంలో దాదాపు 50 మంది ఉగ్రవాదులు మోటార్ సైకిళ్లపై వచ్చి ఈ దాడికి తెగబడ్డారు. మార్కెట్లు, ప్రార్థనా స్థలాలు, ఇళ్లల్లోకి చొరబడి కాల్పులు జరిపారు. భవనాలకు నిప్పుబెట్టి బీభత్సం సృష్టించి అనేకమందిని పొట్టనబెట్టుకున్నారు. ఈ ఘటనలకు బొకోహరమ్ ఇస్లామిక్ సంస్థే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ దాడుల్లో ఇప్పటివరకు 102 మంది మృతదేహాలను పోలీసులు గుర్తించారు. ఇంకా చాలా మంది ఆచూకీ తెలియరాలేదని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. బొకోహరమ్ కార్యకలాపాల గురించి ఈ ప్రాంత వాసులు నిఘా వర్గాలకు సమాచారం ఇచ్చారని, అందుకు ప్రతీకారంగానే ఈ దాడులకు తెగబడ్డారని స్థానికులు చెబుతున్నారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఇటీవల భద్రతా దళాలు ఆపరేషన్ చేపట్టి... అనేక మంది బొకోహరమ్ సభ్యులను మట్టుబెట్టినట్లు తెలుస్తోంది. 2009లో నైజీరియా ప్రభుత్వంపై తిరుగుబాటుకు దిగిన బొకోహరమ్ మిలిటెంట్లు తరచూ దాడులకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది వారు జరిపిన దాడుల్లో ఇప్పటికి కనీసం 1500 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. భద్రతాదళాలు, ఉగ్రవాదుల మధ్య ఘర్షణల్లో మొత్తంగా 35 వేల మంది ప్రాణాలు కోల్పోగా... కనీసం 20 లక్షల మంది వలస వెళ్లారు.

సిఆర్ బ్రాడ్‌కాస్టింగ్ హైదరాబాద్ లిమిటెడ్

(CIN : U93000TG2000PLC033883) email : accounts@99tv.com

రిజిష్టర్ ఆఫీస్ : 3-5-912, మూడవ అంతస్తు, హిమాయత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ - 500029

నోటీసు

వార్షిక జనరల్‌బాడీ సమావేశం (ఏజీఎం) నోటీసులో ప్రస్తావించబడిన లావాదేవీలను నిర్వహించడానికి **సెప్టెంబరు 30, 2024, సోమవారం సాయంత్రం 05.00గం॥లకు** డోర్ నెం.3-6-201, రాజ్‌బహదూర్‌గౌర్ హాలు, హిమాయత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ-500029లో సిఆర్ బ్రాడ్‌కాస్టింగ్ హైదరాబాద్ లిమిటెడ్ (ది కంపెనీ) సభ్యుల 24వ వార్షిక సమావేశం జరుగుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడినది.

కంపెనీ వార్షిక నివేదిక వాటాదారులకు కొరియర్ ద్వారా **సెప్టెంబరు 04, 2024**న పంపబడినదని గమనించగలరు.

ఈ-ఓటింగ్ : 2013 కంపెనీల చట్టం సెక్షన్ 108కి అనుగుణంగా దానికింద వర్తించే నిబంధనల మేరకు నోటీసులో రూపొందించిన అన్ని తీర్మానాలపై సిడిఎస్ఎల్ ప్లాట్‌ఫారం ద్వారా ఎలక్ట్రానిక్ ఈ ఓటింగ్ ద్వారా ఓటింగ్ సభ్యులకు సౌకర్యం కల్పించేందుకు కంపెనీ ఏర్పాటు చేసినట్లు తెలియజేయడానికి సంతోషిస్తున్నది. న్యాయమైన, చట్టపరంగా పారదర్శక పద్ధతి ప్రకారం ఈ-ఓటింగ్ నిర్వహించడానికి స్క్రూటినైజర్‌గా ప్రాక్టీసింగ్ కంపెనీ కార్యదర్శి **శ్రీ ఎం. రమణారెడ్డి**ని బోర్డు నియమించినది. కంపెనీ చట్టం 2013 నిబంధనలకు అనుగుణంగా చేపట్టుటకు ఈ విషయంలో నిబంధనల వివరాలు ఈ దిగువన ఇవ్వబడినాయి.

1. 2022-2023వరకు కంపెనీ 24వ వార్షిక సమావేశం నోటీసు మరియు కంపెనీ వార్షిక నివేదిక సెప్టెంబరు 04, 2024 వరకు వాటాలు కలిగియున్న సభ్యులందరికీ పంపబడినది. ఆగస్టు 28, 2024వ తేదీన ఏజీఎం నోటీసు పంపించడం పూర్తయింది. అనుమతించబడిన పద్ధతిలో సభ్యులకు నమోదు చేసుకున్న చిరునామాకు 2023-24 వార్షిక నివేదికతో పాటు నోటీసు పంపబడినది.
2. ఈ ఓటింగ్ వ్యవధి శుక్రవారం, 27 సెప్టెంబరు 2024 ఉ॥ 9.00గం॥లకు ప్రారంభమై ఆదివారం, 29 సెప్టెంబరు 2024, సా॥ 5.00గం॥లకు ముగుస్తుంది.
3. ఈ-ఓటింగ్ ద్వారా సభ్యులు ఓటు వేసేందుకు అర్హతను నిశ్చయించేందుకు కంపెనీ 2024, సెప్టెంబరు 23వ తేదీని కటాఫ్ తేదీగా ఖరారు చేసింది. 24వ ఏజీయం సందర్భంగా ఓటింగు సోమవారం 30న సెప్టెంబరు, 2024 జరుగుతుందని షెడ్యూలు ప్రకటించబడినది.
4. కంపెనీ ఏజియం నోటీసు పంపిన, తరువాత షేర్లు సేకరించి, కంపెనీ సభ్యుడైన, కటాఫ్ తేదీ నాటికి షేర్లు కలిగి ఉన్న ఏ వ్యక్తి అయినా వార్షిక నివేదికలో లభ్యమయ్యే ఈ-ఓటింగ్ సూచనలను, మరియు కంపెనీ వెబ్‌సైట్‌లో లభ్యమయ్యే సూచనలను ప్రస్తావించవచ్చును. అయితే, ఈ-ఓటింగ్‌కు ఇప్పటికే సిడిఎస్ఎల్‌లో నమోదైన వ్యక్తులు ఓటు వేసేందుకు ఉన్న యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్ ఉపయోగించవచ్చును.

5. సభ్యులకు గమనిక :

ఎ) ఆదివారం 29, సెప్టెంబరు 2024, ఐఎస్‌టి 5.00గం॥లకు మించి ఎలక్ట్రానిక్ మోడ్ ద్వారా రిమోట్ ఈ-ఓటింగ్ సిడిఎస్ఎల్ ద్వారా అనుమతించబడదు.

బి) సభ్యులు ఒకసారి తీర్మానాలపై ఓటు చేసిన తరువాత మార్చుకోవడానికి అనుమతించబడదు.

సి) రిమోట్ ఈ-ఓటింగ్ ద్వారా ఓటు చేయని సభ్యులకు, ఏజియంలో సభ్యులు బ్యాలెట్ పేపరు ద్వారా ఓటు వేయడానికి అనుమతించబడే సౌకర్యం ఉంది.

డి) రిమోట్ ఈ-ఓటింగ్ ద్వారా ఓటు వేసిన సభ్యులు ఏజియంకు హాజరు కావచ్చును. కానీ, తిరిగి ఓటు వేసేందుకు అర్హులుకారు.

6. రిమోట్ ఈ-ఓటింగ్‌కి సంబంధించి ఏవైనా ప్రశ్నలకు, ఫిర్యాదులకు సభ్యులు తరచుగా అడిగిన ప్రశ్నలను (ఎఫ్ఎక్యూస్) హెల్ప్ సెక్షన్ కింద వచ్చే www.evotingindia.comలో లభ్యమయ్యే ఈఓటింగ్ మాన్యువల్‌ను ప్రస్తావించవచ్చును లేదా helpdesk.evoting@cdslindia.com ఈమెయిల్‌కి వ్రాయవచ్చు. లేదా, 3-5-912, మూడవ అంతస్తు, హిమాయత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ-500029లో కంపెనీ రిజిష్టర్డ్ ఆఫీసు కలిగి ఉన్న కంపెనీ సిఎఫ్ఓ **శ్రీ వయ్యుకంటి చెన్నకేశవరావును** సంప్రదించవచ్చును. (Contact: 9848019297, E-mail: chennar@yahoo.com)

తరఫున సిఆర్ బ్రాడ్‌కాస్టింగ్ హైదరాబాద్ లిమిటెడ్

ప్రదేశం : హైదరాబాద్
తేది : 05-09-2024

సం/- నివేదిత సురవరం, డైరెక్టర్
డిఐఎన్ : 02231782

మరో ముప్పు!

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. ఈ మేరకు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. తీరం వెంబడి గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంలో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.ఆగస్టు 31, సెప్టెంబరు 1వ తేదీన కురిసిన భారీ వర్షాలకు ఆంధ్రప్రదేశ్ అతలాకుతలం అయింది. బుడమేరు, మున్నేరు వరదతో కృష్ణమ్మ జల ప్రళయం సృష్టించింది. రికార్డుస్థాయిలో ప్రకాశం బ్యారేజీ వద్ద సుమారు 12 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదలైంది. 125 సంవత్సరాల చరిత్రలో ఇంత భారీస్థాయి నీటి విడుదల ఇదే మొదటిసారని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. దీంతో విజయవాడ సహా పరిసర ప్రాంతాలన్నీ నీట మునిగాయి. కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు, తెలంగాణ రాష్ట్రంలో కూడా భారీ వర్షాలు కురవడం, ఖమ్మం జిల్లాలో దాదాపు 30 చెరువులకు గండ్లు పడడంతో బుడమేరు ఉప్పొంగింది. దీంతో దానికి దిగువనున్న ఇళ్లన్నీ నీట మునిగిపోవడంతో ప్రజలు నిరాశ్రయులయ్యారు. కనీసం తినడానికి తిండి లేక నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికీ అనేక ప్రాంతాలు వరదలోనే ఉన్నాయి. అయితే బుధవారం వరద ఉధృతి తగ్గడం, వాన లేకపోవడంతో హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలోనే వాతావరణ శాఖ మరోసారి హై అలర్ట్ ప్రకటించడం, ఇంకోవైపు బుడమేరులో వరద ప్రవాహం పెరుగుతుందని వార్తలు రావడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బుడమేరుకు మూడు చోట్ల గండ్లు పడినట్లు గుర్తించారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఒక చోట గండిని పూడ్చే ప్రక్రియ సాయంత్రానికి చివరి దశకు వచ్చింది. మిగిలిన రెండు గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రులు నారా లోకేశ్, రామానాయుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. బుడమేరు ప్రాంత ప్రజలకు ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రజలు పుకార్లు నమ్మవద్దని, ఎగువ ప్రాంతంలో వరద వస్తే ముందే సమాచారం ఇస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన ప్రజలకు ధైర్యం చెప్పారు.

కన్నీటి వ్యథ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:

భారీ వర్షాలు, వరదతో నాలుగు రోజులుగా అవస్థలు పడిన విజయవాడ ప్రజల కన్నీటి వ్యథ అంతా ఇంతా కాదు. కనీసం బయటికి రావడానికి కూడా వీలు లేని పరిస్థితుల్లో బాధితులు ఇళ్లకే పరిమితమయ్యారు. తినడానికి తిండి లేక... తాగడానికి నీళ్లు లేక... పసిబిడ్డలకు కనీసం పాలు అందక అవస్థలు పడ్డారు. ప్రస్తుతం వరద నుంచి కొంత ఉపశమనం లభించినా వరదలకు సమస్తం కోల్పోయి అల్లాడుతున్నారు. కాగా, బుడమేరు వరద ముంపు నుంచి విజయవాడ నగరం క్రమంగా తేరుకుంటోంది. కాస్త వరద తగ్గుముఖం పట్టడంతో 16 డివిజన్లలో నాలుగు రోజులుగా జలదిగ్బంధంలో ఉండిపోయిన ప్రజలు బతుకు జీవుడా అంటూ ఇళ్లు వదిలి బయటకొచ్చేందుకు సాహసిస్తున్నారు. నడుములోతు నీళ్లల్లోంచి ప్రధాన రహదారులపైకొచ్చి తమ బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి తలదాచుకుంటున్నారు. వరద ముంపునకు గురైన తమ వాహనాలు, ఆటోల కోసం వెతుకులాడుతున్నారు. ఇళ్లల్లో విలువైన వస్తువులు, దుస్తులు, విద్యార్థుల పుస్తకాలు, సర్టిఫికెట్లు వరదనీటి పాలవ్వడంతో వారికి దిక్కుతోచడంలేదు. అయితే బుడమేరు పరివాహక ప్రాంతంలో చాలా మంది ప్రజలు ఇంకా ముంపులోనే జీవనం సాగిస్తున్నారు. వరద ముంపులో గల్లంతైన వారి మృత దేహాల కోసం బాధితులు గాలిస్తున్నారు. ఒక వైపు బాధితులకు ప్రభుత్వ సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతుండగా... మరోవైపు అల్పపీడన ప్రభావంతో బుధవారం తెల్లవారుజాము నుంచి మళ్లీ వర్షం పడటం, కొన్ని చోట్ల బుడమేరు కట్టలకు గండిపడటం ప్రజానీకాన్ని కలవరపెడుతున్నాయి. ముంపు బారిన పడతామన్న ఆందోళనతో వారంతా ఇళ్లను వదిలి బయటకు వస్తున్నారు. కాగా ప్రభుత్వం అందజేస్తున్న సాయం క్షేత్రస్థాయిలోకి వెళ్లడం లేదన్న విమర్శలున్నాయి. విజయవాడ సింగ్‌నగర్ పరిసర ప్రాంతాలు, జక్కంపూడి కాలనీల ప్రజలు ముంపులోనే కొనసాగుతున్నారు. ఆహారం, పాలు, మంచినీరు అందక సమీప ప్రాంతానికి వచ్చి వాటిని తీసుకెళ్లేందుకు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. బుడమేరుకు మొత్తంగా మూడు గండ్లు పడగా, అందులో మైలవరం నియోజవర్గంలోని శాంతినగర్ దగ్గర పడిన గండిని పూడ్చే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. అక్కడి నుంచే జక్కంపూడి, సింగ్‌నగర్‌కు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోపక్క ముంపు ప్రాంతాల బాధితులకు సాయంపై సీఎం చంద్రబాబు సమీక్షలు, పర్యటనలు కొనసాగుతున్నాయి. ఎన్టీఆర్‌జిల్లా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని ముంపు ప్రాంతాల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పర్యటించారు. విజయవాడ నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాలకు మాజీ సీఎం జగన్ వెళ్లి బాధితులతో పరిస్థితిని ఆరా తీశారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.

కవులూరులో బుడమేరుకు గండి..పంట పొలాల నీట మునక

ఇబ్రహీంపట్నం మండలంలోని కవులూరు వద్ద బుడమేరుకు గండిపడటంతో వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఈలప్రోలు సమీపాన భారీగా బుడమేరు వరద ప్రవహిస్తోంది. దీంతో ఈలప్రోలు నుంచి ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. నాలుగు రోజుల నుంచి జలదిగ్బంధంలో ఉన్న ఐదు గ్రామాల ప్రజలు..బుడమేరు వాగు ఉప్పొండడంతో ఆర కిలోమీటరుమేర రోడ్డు కొట్టుకుపోయింది. పైడూరిపాడు, రాయనపాడు, కవులూరు, జక్కంపూడి, ఆలప్రోలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీని ప్రభావంతో వరి, మిర్చి, పత్తి చేలకు, చేపల చెరువులకు అపార నష్టం వాటిల్లింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రుల నిమ్మల రామానాయుడు, నారా లోకేశ్ పర్యవేక్షణలో బుడమేరు గండ్లకు అధికారులు మరమ్మతులు నిర్వహిస్తున్నారు.

రైల్వేబ్రిడ్జికి గండి..సమీప ప్రాంత ప్రజల అప్రమత్తం

విజయవాడ మధురానగర్ సమీపంలోని రైల్వేబ్రిడ్జి దగ్గర బుడమేరు కాల్వకు గండి పడింది. ఈ నీరంత సమీపంలోని ఏలూరు కాల్వలోకి వచ్చి ఎగిసిపడుతోంది. దీంతో పరిసర ప్రాంతంలోని ఇళ్లల్లోకి వరద నీరు చేరే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వారంతా ఖాళీచేసి..సమీపంలోని శారద కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి తరలివెళ్లాలని మైక్‌ద్వారా ప్రచారం వేయించారు.

అట్టపెట్టెలో శిశువు...

విజయవాడ సింగ్‌నగర్ ముంపు ప్రాంతంలో ఓ శిశువును రక్షించుకోవాలన్న తపనతో అట్టపెట్టెలో పెట్టి వరద నీటిలోకి వదిలిన దృశ్యం దయనీయంగా మారింది. ఓ ఇంటి చుట్టూ భారీ వర్షాలు, వరదలతో వరద నీరు చేరింది. అందులో ఉంటున్న దంపతులకు వెంట నెలలు నిండిన శిశువు ఉంది. చుట్టూ వరద నిండటంతో విషకీటకాలు, పాములు వచ్చే అవకాశం ఉండటం, అపరిశుభ్ర వాతావరణంలో శిశువుకు ప్రమాదం పొంచి ఉంది. దీంతో శిశువును సురక్షిత ప్రాంతానికి తరలించాలని కుటుంబీకులు నిర్ణయించారు. అనంతరం ఇద్దరు వ్యక్తులు పసుపు రంగు ప్లాస్టిక్ డబ్బాలో శిశువును పడుకోబెట్టి, పీకల్లోతు నీటిలో నిదానంగా నడుచుకుంటూ వెళ్తూ... సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీనిని ఓ నెటిజన్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఎట్టకేలకు ఆ చిన్నారిని సాహసోపేతంగా సురక్షిత ప్రాంతానికి తరలించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఎగువ నుంచి వస్తున్న రామిలేరు, బుడమేరు, తమ్మిలేరు వరద కొల్లేరును ముంచెత్తింది. కృష్ణాజిల్లా నందివాడ మండలంలో బుడమేరు ఉగ్రరూపం దాల్చుతోంది. రికార్డు స్థాయిలో నీటి ప్రవాహం బుడమేరుకు వచ్చి చేరుకుంటోంది. 30 ఏళ్లలో బుడమేరు ఎన్నడూ ఇంతటి ఉధృతంగా ప్రవహించలేదని ముంపు ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. పుట్టగుంటలో నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా వరద నీరు ప్రవేశించింది. అనేక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వరద నీటితో భయాందోళనలో బుడమేరు పరివాహక గ్రామాల ప్రజలు ఉన్నారు. బోట్ల ద్వారా పంపు ప్రాంతాల ప్రజలను అధికారులు ఎగువ ప్రాంతాలక చేరుస్తున్నారు. బుడమేరు నీరు చేరి...ఏలూరుజిల్లాలోని కొల్లేరు ఉగ్రరూపం దాలుస్తోంది.

సహాయ చర్యలు ముమ్మరం

(మొదటిపేజీ తరువాయి)

మందికి భోజన ఏర్పాటు చేశామని, గర్భిణీలకు ప్రత్యేక వైద్యం అందించామన్నారు. విజయవాడకు బుడమేరు ప్రధాన సమస్యగా మారిందని, చిన్న చిన్న వాగులు కలిసి బుడమేరు పెద్దదిగా మారిందని సీఎం చెప్పారు. అటు కృష్ణానది, ఇటు బుడమేరు కలిసి విజయవాడ నగరాన్ని ముంచెత్తాయని, బుడమేరును గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఐదేళ్లపాటు ఏం చేశారని వైసీపీ నేతల్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. వాగులను కబ్జా చేయడమే ఈ దుస్థితికి కారణమని విమర్శించారు. చివరకు పోలవరం కాల్వలోనూ మట్టిని తవ్వేశారని, బుడమేరు నీరు కొల్లేరు, కృష్ణానదికి వెళ్లేలా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. బుడమేరు ప్రవాహ దారిలో కాల్వలు, వాగుల్లో కబ్జాలు తొలగిస్తామని, ఇలాంటి విపత్తులను అందరూ సమిష్టిగా ఎదుర్కొవాలని కోరారు. గురువారం నాటికి వరద పూర్తిగా తగ్గిపోనుందని చంద్రబాబు తెలిపారు. కేంద్రమంత్రి అమిత్‌షాతో తాను ఫోన్లో మాట్లాడాననీ, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని కోరినట్లు సీఎం చెప్పారు. విజయవాడ, అమరావతి ముంపు బారిన పడకుండా కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

బోట్లకు డబ్బులు అడిగితే కేసుల నమోదు: సీఎం హెచ్చరిక

వరద బాధితులను బోట్లలో తీసుకెళ్లడం కోసం డబ్బులు అడిగితే అరెస్టుచేసి కేసులు పెడతామని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ప్రైవేట్ బోట్ల వాళ్లు కూడా డబ్బులు వసూలు చేయొద్దని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచకుండా ఉండేలా ప్రణాళిక రూపొందించామన్నారు. కూరగాయల ధరలు ప్రభుత్వమే నిర్ణయిస్తుందని, నిత్యావసర వస్తువుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. వివిధ ఉద్యోగ సంఘాలు ఒక్కరోజు వేతనం ఇచ్చేందుకు ముందుకొచ్చాయని చెప్పారు. అమరావతి మునిగిపోయిందంటూ తప్పుడు ప్రచారం చేయడాన్ని సీఎం ఖండించారు. అబద్ధపు ప్రచారం చేసేవారిని సంఘు బహిష్కరణ చేయాలని, వైసీపీకి రాష్ట్రంలో ఉండే అర్హత లేదన్నారు. సాయంచేయకపోగా నిందలేసి, తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కోసం తాను యజ్ఞం చేస్తుంటే, వైసీపీ నేతలు అడ్డుపడుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా విమర్శలను విడనాడాలని చంద్రబాబు సూచించారు.

ప్రతి ఇంటికీ సాయం అందించాలి: అధికారులకు దిశానిర్దేశం

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సహాయం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై మంత్రులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వరదల్లో చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాల వారికి అప్పగించాలని, ఎవరూ ముందుకు రాకపోతే ప్రభుత్వం తరపునే అంత్యక్రియలు నిర్వహించాలన్నారు. వరద తగ్గినందును ఆహారం ఇంటింటికీ వెళ్లే అవకాశముందని, ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, లీటర్ పామాయిల్, 2 కిలోల ఉల్లిపాయలు, 2 కిలోల బంగాళదుంప, కిలో చక్కెర అందించాలని ఆదేశించారు. మొబైల్ రైతు బజార్లు ఏర్పాటు చేసి బ్లాక్ మార్కెటింగ్ లేకుండా అతి తక్కువ ధరకు కూరగాయలు విక్రయించేలా చర్యలు చేపట్టాలని, నష్టాన్ని వివరించి కేంద్ర సాయం కోరదామని చెప్పారు. ఆహారం, నీరు, బిస్కెట్లు, పాలు, అరటిపండ్లు అన్నీ ఇంటింటా అందించాలని, అన్ని అంబులెన్సులు పూర్తి స్థాయిలో అందుబాటులో పెట్టాలని, విద్యుత్ పునరుద్ధరణ వేగవంతం చేయాలని, పారిశుద్ధ్య పనులు ఒక యుద్ధంలా జరగాలన్నారు. ప్రతి ఇంటిని క్లీన్ చేసేటప్పుడు ఇంటికి సంబంధించిన వారిని భాగస్వామ్యులను చేయాలని కోరారు. వైరల్ ఫీవర్లు, దోమల బెడద ఎక్కువగా ఉండే అవకాశముందని, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కరపత్రాల ద్వారా ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ప్రతి సచివాలయంలో ఒక వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. దాని ప్రత్యేక హోదా ఆగస్టు 2019లో రద్దయింది. 'అసెంబ్లీ ఎన్నికలకు ముందు జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని మేము కోరుకున్నాం. కానీ బీజేపీ సుముఖంగా లేదు. మొదట ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంది' అని తెలిపారు. 'ఈ ప్రాంతానికి తిరిగి రాష్ట్ర హోదా వచ్చేలా చూస్తాం. బీజేపీ కోరుకున్నా లేదా కోరుకోకపోయినా రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ఇండియా ఐక్య సంఘటన నాయకత్వంలో మేము ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం' అని కాంగ్రెస్ అగ్ర నేత అన్నారు. మొదటి దశలో మరో 25 నియోజకవర్గాలతో పాటు ఎన్నికలు జరగనున్న రాంబన్ జిల్లాలోని బనిహాల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సంగల్దాన్ వద్ద జరిగిన ఎన్నికల ర్యాలీలో గాంధీ ప్రసంగించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు వికార్ రసూల్ వానీ ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి సాజాద్ షాహీన్, బీజేపీకి చెందిన సలీమ్ భట్ నుంచి పెద్ద సవాలును ఎదుర్కొంటున్నారు. మాజీ మంత్రి వాణి ఈ స్థానం నుంచి హ్యాట్రిక్‌పై కన్నేశారు. 'భారతదేశ ఆధునిక చరిత్రలో ఏ రాష్ట్రానికైనా రాష్ట్ర హోదాను కోల్పోవడం ఇదే తొలిసారి. ఇంతకుముందు కేంద్ర పాలిత ప్రాంత రాష్ట్రాలుగా రూపాంతరం చెందాయి. కానీ అలాంటిదేమీ జరగలేదు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ప్రాధాన్యతపై పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఇది మాత్రమే కాదు. రాజ్యాధికారంతోపాటు హక్కులు, ప్రజల సంపద కూడా దోచుకున్నాయి' అని ఆయన విమర్శించారు. లెఫ్టినెంట్ గవర్నర్ పనితీరును గత రాజులతో పోల్చిన ఆయన, దేశం వారి స్థానంలో 1947లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. 'ఇక్కడ జమ్మూకశ్మీర్‌లో ఎల్‌జీ అనే పేరున్న ఒక రాజు కూర్చున్నాడు. అతను మీ సంపదను తీసుకొని బయటి వ్యక్తులకు లబ్ధి పొందుతున్న కాంట్రాక్టర్‌లను తీసుకువచ్చి ఇస్తున్నాడు. 'మా మొదటి అడుగు జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడం... ఒక విషయం గుర్తుంచుకోండి. ఈ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పడబోతోంది. అది కచ్చితంగా జరగబోతోంది' అని ఆయన అన్నారు. అన్ని ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేస్తామని, అభ్యర్థుల వయస్సును 40 ఏళ్లకు పెంచుతామని, రోజువారీ కూలీలను క్రమబద్ధీకరిస్తామని కాంగ్రెస్ తన జాతీయ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని ఆయన తెలిపారు. నిర్మాణంలో ఉన్న విద్యుత్ ప్రాజెక్టుల గురించి ప్రస్తావిస్తూ, జమ్మూకశ్మీర్‌లో ఉత్పత్తి చేయబడిన విద్యుత్ స్థానిక ప్రజల కష్టాలను భరించి బయటికి ఎగుమతి అవుతుందని, పెంచిన బిల్లులు లేకుండా విద్యుత్‌ను అందించడం ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు తన 4000 కిలోమీటర్ల 'భారత్ జోడో యాత్ర' గురించి మాట్లాడుతూ 'మేము 'నఫ్రత్ కే బజార్ మే మొహబత్ కి దుకాన్ ఖోల్నీ హై' (విద్వేషం ఆవరించిన మార్కెట్‌లో ప్రేమ దుకాణాలు తెరవాలి) అనే నినాదాన్ని ఇచ్చాం. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు 'ద్వేషం, హింస, భయాన్ని' వ్యాప్తి చేస్తున్నాయి' అని ఆయన ఆరోపించారు. ఈ పోరాటం రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతోందని, ఒకటి ద్వేషం, హింస, భయాన్ని కలిగిస్తుందని, మరొకటి ప్రేమ, గౌరవాన్ని ప్రచారం చేస్తున్నాయని అన్నారు. 'వారు ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి పని చేస్తారు. మా పని ప్రేమను వ్యాప్తి చేయడం. వారు విభజిస్తారు. మేము ఏకం చేస్తాం. ద్వేషం ప్రేమతో భర్తీ చేయబడుతుందని మీకు తెలుసు. ద్వేషాన్ని ద్వేషంతో ఓడించలేము. ప్రేమ మాత్రమే ద్వేషాన్ని ఓడించగలదు' అని ఆయన మత సామరస్యం ఆవశ్యకతను ఎత్తి చూపారు. గాంధీ ఈ ప్రాంత అందాన్ని కొనియాడారు. ఎన్నికల తర్వాత కొన్ని రోజులు గడపాలని తన కోరికను వ్యక్తం చేశారు.

ఏ బ్యాంక్ నుంచైనా పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

ఈపీఎఫ్ఓ జోనల్/ప్రాంతీయ కార్యాలయాలు కేవలం 3-4 బ్యాంకులతో మాత్రమే ఒప్పందాలు కలిగి ఉన్నాయి. పింఛను ప్రారంభ సమయంలో పింఛనుదారులు ధ్రువీకరణ కోసం సంబంధిత బ్యాంక్‌కు వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. సెంట్రలైజ్డ్ విధానం వల్ల బ్రాంచ్‌ను సందర్శించాల్సిన అవసరం తప్పనుంది. అంతేకాకుండా పింఛన్ విడుదలైన వెంటనే ఆ మొత్తం ఖాతాలో జమ అవుతుంది. ఈ కొత్త వ్యవస్థతో పింఛను పంపిణీలో ఖర్చు సైతం తగ్గుతుందని ఈపీఎఫ్ఓ భావిస్తోంది. తదుపరి దశలో ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మాండవీయ చెప్పారు.

వైసీపీ నేతలకు హైకోర్టులో చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు క్రైం నెంబర్ 650/2021గా కేసు నమోదు చేశారు. ఐపీసీ 307 సెక్షన్‌తో పాటు మరికొన్ని సెక్షన్లు జోడించారు. ఐపీసీ 147,148, 452, 427, 323, 324, 506, 326, 307, 450, 380, రెడ్‌విత్ 109, 120బి, 149 తదితర సెక్షన్లతో కేసు నమోదైంది. ఈ క్రమంలో ఇప్పటివరకు మొత్తం 106 మందికి టీడీపీ కార్యాలయంపై దాడిలో ప్రమేయం ఉన్నట్లు పోలీసుల గుర్తించారు. 21 మందిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. మిగతా 85 మందికి మంగళగిరి రూరల్ పోలీసులు ఈ నెల 19 నుంచి నోటీసులు జారీ చేశారు. వీరిలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితోపాటు విజయవాడకు చెందిన వైసీపీ నేత దేవినేని అవినాశ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, అరవ సత్యం వంటి ముఖ్య నేతలున్నారు. నాటి ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు నివాసంపై దాడి ఘటనలో మాజీమంత్రి జోగి రమేశ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ గూటికి వినేశ్, పునియా

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 50 కేజీల రెజ్లింగ్ విభాగంలో వినేశ్ ఫొగట్ ఫైనల్స్ వరకు వెళ్లిన విషయం తెలిసిందే. తుదిపోరులో అమెరికాకు చెందిన రెజ్లర్ సారా హిండెబ్రాండ్‌తో తలపడాల్సి ఉంది. 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఫొగాట్ అనర్హత వేటుకు గురయ్యారు. దీంతో ఆమె పతకం కోల్పోయారు. స్వదేశం తిరిగి వచ్చిన ఫొగాట్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. బాధపడొద్దని చెబుతూ ఫొగాట్‌కు మనో ధైర్యం నింపారు. ఢిల్లీ విమానాశ్రయం నుంచి హర్యానాలో గల స్వగ్రామం వరకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఢిల్లీలో రాహుల్ గాంధీతోపాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వేణుగోపాల్‌తో వినేశ్, బజరంగ్ భేటీ అయ్యారు.

త్వరలో జరగబోయే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. హర్యానాకు ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే 34 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను కాంగ్రెస్ సిద్ధం చేసింది. కాంగ్రెస్ మలివిడత జాబితాలో రెజ్లలిద్దరి పేర్లను పార్టీ ప్రకటించే అవకాశం ఉంది. వినేశ్ ఇటీవలే ఉత్తరాది రైతుల ఆందోళనల్లో పాల్గొన్నారు. అప్పటి నుంచే ఆమె రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం జరిగింది.

షాట్‌పుట్‌లో రజతం

(మొదటిపేజీ తరువాయి)

సచిన్ తొలి ప్రయత్నం 14.72 మీటర్లు, రెండో ప్రయత్నం 16.32 మీటర్లు, మూడో ప్రయత్నం 16.15 మీటర్లు, నాలుగో ప్రయత్నం 16.31 మీటర్లు, ఐదో ప్రయత్నం 16.03 మీటర్లు, ఆరో ప్రయత్నంలో 15.95 మీటర్లు విసిరాడు. అయితే రెండో ప్రయత్నంలో 16.32 మీటర్ల దూరం విసరడం ఆసియాలోనే కొత్త రికార్డుని సృష్టించింది. ఇంతకు ముందు కూడా ఈ రికార్డు సచిన్ ఖిలారీ పేరిటే ఉంది. మే 2024లో జపాన్‌లో జరిగిన ప్రపంచ పారా-అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించి ఆసియా రికార్డు సృష్టించాడు. కాగా ప్రస్తుత పారాలింపిక్స్‌లో కెనడాకు చెందిన గ్రెగ్ స్టీవర్ట్ 16.38 మీటర్లతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అంటే ఖిలారీ కేవలం 0.06 మీటర్లు వెనుక బడి త్రుటిలో స్వర్ణం కోల్పోయాడు.

ఆప్తుల మృతదేహాల కోసం నిరీక్షణ

రాష్ట్రవ్యాప్తంగా 20 మంది మృతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వరద ముంపులో ఆప్తుల్ని కోల్పోయిన వారు మృతదేహాల కోసం పడిగాపులు కాస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో తమ వారి మృతదేహాల కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రి మార్చ్యూరీ వద్దకు వస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి 12 మృతదేహాలు వచ్చాయి. వాటికి పోస్టుమార్టం ప్రక్రియను పూర్తిచేసి ఇచ్చేందుకు అధికారులు, పోలీసులు జాప్యం చేస్తున్నారని కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. అటు వరద నీటిలో గల్లంతైన వారి మృత దేహాల కోసమూ వారి బంధువులు ఆస్పత్రి వద్ద ఎదురుచూస్తున్నారు. వారి ఆచూకీని ఇంతవరకు తెలపలేదని మండిపడు తున్నారు. భారీ వర్షాలు, వరద ముంపుల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది మృతి చెందినట్లు, మృతుల్లో అత్యధికంగా ఎన్టీఆర్‌జిల్లాలోనే 24 మంది ఉన్నారని ప్రభుత్వం వెల్లడిం చింది. ఆ తర్వాత గుంటూరు జిల్లాలో ఏడుగురు, పల్నాడు జిల్లాలో ఒకరు మరణించినట్లు తెలిపింది. రాష్ట్రంలో 1,69,370 ఎకరాల్లో పంట, 18,424 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. 2.34లక్షల మంది రైతులు నష్టపోగా, 222 పశువులు మరణిం చాయి. వరదల వల్ల 22 విద్యుత్ సబ్ స్టేషన్లు, 3,312 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. 78 చెరువులు, కాల్వలకు గండ్లుపడ్డాయి. వర్షం, వరదల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 6,4,,536 మంది నష్టపోయారు. 193 సహాయ శిబిరాల్లో 42,707 మంది ఆశ్రయం పొందుతున్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు 50 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సేవలందిస్తున్నాయి. 228 బోట్లను సహాయ, రక్షణ చర్యలకు వినియోగి స్తున్నారు. 317 గజ ఈతగాళ్లను రంగంలోకి దింపారు. ఆరు హెలీకాప్టర్ల ద్వారా ఆహారం సరఫరా చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన మృతుల సంఖ్య వాస్తవాలకు దూరంగా ఉందని... ఇంకా చాలా మంది వరదల్లో గల్లంతైనట్లు బాధితులు తెలుపు తున్నారు. వరద నీరు తగ్గితేనే అసలు మరణాల సంఖ్య వెల్లడవుతుందని అంచనా వేస్తున్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ఏపీ రైతు సంఘం డిమాండ్

వరద ముంపు ప్రాంతాల్లో రాష్ట్ర నేతల బృందం పర్యటన

విశాలాంధ్ర-జి.కొండూరు: భారీ వర్షాలు, వరదలతో బుడమేరు పరీవాహక ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయని, దీనిని జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించి బాధితులను ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఎన్టీఆర్ జిల్లాలోని ఎ.కొండూరు మండలం కవులూరులో వరద ముంపు బాధితులను బుధవారం ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావుతో కూడిన రాష్ట్ర నేతల బృందం పర్యటించింది. ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించి, రైతుల కష్టాలను బృందం అడిగి తెలుసుకుంది. పంట పొలాలన్నీ నీట మునిగాయని, నివాస ప్రాంతాలన్నీ వరద నీటిలో ఉన్నాయని, బుడమేరు పరిసర ప్రాంతాలన్నింటిలో ఆస్తి, పంట, ప్రాణ నష్టం జరిగినట్లుగా వెల్లడయిందని రాష్ట్ర నాయకుల బృందం తెలిపింది. కోట్లాది రూపాయల నష్టం వాటిలినట్లు పరిశీలనలో తేలిందని రైతు సంఘం నేతలు ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ నగరం, బుడమేరు పరిసర ప్రాంతాలన్నీ జల సమాధి అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించి, యావత్తు ప్రజానీకాన్ని యుద్ధ ప్రతిపాదికన ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర సహాయక బృందాలు రాష్ట్రంలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించాలని కోరారు. ఈ పర్యటనలో రాష్ట్ర నాయకుల బృందంతో పాటు బుద్ది రమేశ్, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు.

ఈ చావులకు చంద్రబాబే కారణం

ముంపు ప్రాంత పర్యటనలో మాజీ సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద ముంపు బాధితుల పట్ల చంద్రబాబు అలసత్వం వహిస్తున్నారని, ఈ చావులకు చంద్రబాబే కారణమని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. బుడమేరు గేట్లను శనివారమే ఎందుకు, ఎవరెత్తారని నిలదీశారు. బుధవారం రాజరాజేశ్వరిపేట వరద ప్రభావిత ప్రాంతాలో జగన్ పర్యటించి బాధితుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు, వరదలతో 32 మంది మృతి చెందారని, బాధితులకు సాయం అందించడంలో సీఎం వైఫ్యలం చెందారన్నారు. తుపాన్ రాబోతుందన్న విషయం చంద్రబాబుకు తెలియదా?, వాతావరణ శాఖ అప్రమత్తం చేసినా పట్టించుకోలేదా? అని సూటిగా ప్రశ్నించారు. వరదతో చంద్రబాబు ఇల్లు మునిగిపోయిందని, తన ఇంట్లో ఉండే పరిస్థితి లేనందునే కలెక్టరేట్ కార్యాలయంలో ఉండి బిల్డప్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. వరదలపై ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సమీక్షించి సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించి, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఉంటే ఇంతటి పరిస్థితి ఉండేది కాదన్నారు. నాలుగు నెలల్లో అధికారులందరినీ మార్చేశారని, ఇప్పుడు అధికారులను తప్పుపట్టడం తగదని సూచించారు. చంద్రబాబు చేసిన తప్పులకు అధికారులను బలి చేస్తూ... తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబు హుందాగా ఒప్పుకోవాలని, వలంటీర్ల వ్యవస్థ ఉంటే ఇలా ఉండేదీ కాదని, రిటైనింగ్ వాల్ లేకుంటే కృష్ణలంక మునిగిపోయేదని స్పష్టం చేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు ఏమీ చేయడం లేదని, అసలు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదీ కాదన్నారు. గత తమ ప్రభుత్వ హయాంలో ఇలాంటి దుస్థితి ఏనాడూ కనిపించలేదని, నాడు గోదావరికి వరదలు వస్తే 40 వేల మందికి పునరావాస శిబిరాలను ఏర్పాటు చేశామని, వలంటీర్లు ముందుగానే అప్రమత్తమయ్యేవారని గుర్తు చేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అంతా కలిసి పునరావాస శిబిరాలకు బాధితులను తరలించేవారన్నారు. వరద ప్రభావం తగ్గాక, వారికి తక్షణమే పరిహార సొమ్మును పంపేవారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం, సామాగ్రి కోల్పోయిన ప్రతి ఇంటికి రూ.50 వేలు అందజేయాలని జగన్ డిమాండ్ చేశారు.

వరద బాధితులను ఆదుకునేందుకు

విరివిగా విరాళాలివ్వాలి: జగదీశ్

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం / గుంతకల్: వరద బాధితులను ఆదుకునేందుకు విరివిగా విరాళాలివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి. జగదీశ్ పిలుపునిచ్చారు. వరద విపత్తు నుంచి ప్రజలను రక్షించటానికి మేము సైతం అని ప్రజలంతా రాజకీయాలకు అతీతంగా స్పందించి స్వచ్ఛందంగా తోచినంత విరాళాలు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ అకౌంటుకు పంపాలని పిలుపునిస్తూ అనంతపురం జిల్లా గుంతకల్ మున్సిపల్ ఆఫీసువద్ద బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను చేతబట్టుకొని ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ వరద బాధితులకు సహాయ, సహకారాలు అందించేందుకు సీపీఐ, యవజన, విద్యార్థి సంఘాల నాయకులు కార్యకర్తలు, రాత్రింభవళ్లు విజయవాడలో శ్రమిస్తున్నారని తెలిపారు. వరద బాధిత సహాయ కార్యక్రమాలలో పాల్గొనడానికి పార్టీ తరుపున జనసేవా కార్యకర్తలను అనంతపురం జిల్లా నుంచి పంపుతున్నామని జగదీశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రయ్య, సహాయ కార్యదర్శి మహేశ్, పట్టణ కార్యదర్శి గోపి, సహయ కార్యదర్శి గౌస్, రూరల్ మండల కార్యదర్శి రాము రాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజానాట్యమండలి నాయకులు కుళ్లాయప్ప, వరప్రసాద్, పుల్లయ్య, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వినోద్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో ఏయూ వేదికగా

దాశరథి శతజయంతి వేడుకలు

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఆంధ్రవిశ్వ కళాపరిషత్ తెలుగుశాఖ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహించనున్న కళాప్రపూర్ణ దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలు జయప్రదం కావాలని ఏయూ ఉపకులపతి ఆచార్య జీ శశిభూషణరావు అభిలషించారు. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో విశ్వవిద్యాలయం టీఎల్ఎన్ సమావేశం మందిరంలో జరగనున్న ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీ ఆర్ రాజు, తెలుగు విభాగం అధ్యక్షులు ఆచార్య జర్ర అప్పారావు, అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి తదితరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవాల నిర్వహణకు అన్ని విధాలా సహాయ సహకారాలందిస్తామని తెలిపారు. జర్ర అప్పారావు, ఉప్పల అప్పల రాజు, క్షేత్రపాల్ రెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 10, 11 తేదీల్లో జరుగనున్న ఉత్సవాలకు వివిధ యూనివర్సిటీల ఆచార్యులు, ప్రముఖ కవులు, రచయితలు హాజకవుతారని తెలిపారు. తొలిరోజు అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ కీలక ఉపన్యాసం చేస్తారని, అతిథులుగా విశాలాంధ్ర పత్రిక సంపాదకులు ఆర్వీ రామారావ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్ బాలాచారి, వై.విజయ్ కుమార్, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్య నారాయణమూర్తి, అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ తదితరులు హాజరవుతారని తెలిపారు. అనంతరం జరిగే సదస్సులో దాశరథి జీవితం, సాహిత్య కృషిపై ఆచార్య కాత్యాయిని విద్మహే, దాశరథి కవిత్వం-సామజిక జీవితం పై డాక్టర్ కోయి కోటేశ్వరరావు, తెలంగాణ విముక్తి పోరాటంలో దాశరథి పాత్ర పై ఆర్వీ రామారావ్, దాశరథి నాటక సాహిత్యంపై వల్లూరి శివప్రసాద్, గాలిబ్ గీతాలు పై ఖాదర్ మొహియుద్దీన్, యాత్రా స్మృతిపై జీఎస్ చలంతో పాటు ప్రముఖ రచయితలు ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ డీవీ సూర్యారావు తదితరులు ప్రసంగిస్తారని వివరించారు. అభ్యుదయ రచయితల సంఘం, జన సహకార సమితి నిర్వహణలో అవార్డుల ప్రదానం ఉంటుందని అరసం నేతలు తెలిపారు. ఆచార్య కాత్యాయని విద్మహేకి కందుకూరి వీరేశలింగం పురస్కారం, డాక్టర్ కే ముత్యంకు విరియాల లక్ష్మీపతి పురస్కారం, ఆర్వీ రామారావ్‌కు పురిపండా అప్పల స్వామి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

బెజవాడ బుడమేరే...!

క్షేత్రస్థాయికి వెళ్లని సాయం

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కొంప కొల్లేరు అయిందని, బెజవాడ బుడమేరే అయిందని, వరదల్లో ఇప్పటికీ చాలా మంది చనిపోయారని, ఇళ్లు దెబ్బతిన్నాయని షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ నగరంలోని వరద ముంపు ప్రాంతాల్లో బుధవారం షర్మిల పర్యటించి... అనంతరం బాధితులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. చంద్రబాబు చేస్తున్న సహాయక చర్యలు సంతోషమని, సహాయక చర్యలు క్షేత్రస్థాయికి చేరడం లేదన్నారు. విజయవాడ వరదలకు బుడమేరు కారణమని, ఇది ఘోర విపత్తు అని చెప్పారు. ఇంత విపత్తు సంభవిస్తే ప్రధాని మోదీ కనీసం స్పందించలేదని, ఈ వరదలు కేంద్రానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మోదీని మనం నెత్తిన పెట్టుకుంటే... మళ్లీ మళ్లీ మోసగించే అవకాశముందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర విపత్తును మీరు పరిగణనలోకి తీసుకోవాలని, దీనిని జాతీయ విపత్తుగా పరిగణించాలని కోరారు. బుడమేరు వరదలు రాకుండా సమస్యను పరిష్కరించాలని, బుడమేరు మళ్లింపు పథకానికి రూపకల్పన చేశారన్నారు. అయితే బుడమేరు కాలువలు మొత్తం మూసుకు పోయాయని, సహజ ఉధృతిని అడ్డుకొనేలా అక్రమ నిర్మాణాలు వెలిశాయని చెప్పారు. పోలవరం రైట్ కెనాల్‌కి కొంత వరద కలిపారని, డైవర్షన్ స్కీమ్‌కు విద్యుత్ కేంద్రం చేసినందున కుదరలేదని, అయినా ఆ రోజుల్లో బుడమేరు కట్టలు బలోపేతం చేశారన్నారు. పదేళ్లుగా ఆక్రమణలు జరిగాయని, తెలంగాణలో హైడ్రా మాదిరిగా బుడమేరు ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ ప్రమాదం రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రస్తుతం చంద్రబాబు మీదే ఉందన్నారు. బీజేపీతో కూటమి కట్టిన చంద్రబాబుకు కేంద్రం ఎందుకు మద్దతివ్వదని సూటిగా ప్రశ్నించారు. అంతకుముందు ప్రకాశం బ్యారేజీ గేట్లు విరిగిపోయిన ప్రాంతాన్ని షర్మిల పరిశీలించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద కావాలనే పడవలను వదిలారా?, ఈ తరహా ఘటనలపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలకు కేంద్రం భారీగా నిధులు ఇవ్వాలి: ఎన్సీపీ

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు, వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో బాధితుల సహాయక చర్యలకు కేంద్రం ఇతోధికంగా నిధులు అందించాలని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ జమీల్ అహ్మద్ బేగ్ కోరారు. వరద ముంపు ప్రాంతాల్లో భారీగా ఆస్తినష్టం, పంట నష్టం జరిగిందని, కేంద్రం తక్షణంసాయం అందించాలని ఆయన కోరారు. విజయవాడ తారకరామానగర్, రాణీగారితోటలోని రామాలయం కమ్యూనిటీ హాల్, ఓడీబీ కమ్యూనిటీ హాల్, గుంటూరు జిల్లా పెదకాకాని ఎంపీపీ స్కూల్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన సందర్శించి... వరద బాధితులను పరామర్శించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్షేత్రస్థాయిలో తిరుగుతూ వరద బాధితులకు తక్షణ సాయం అందేలా చూడటాన్ని అభినందించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలలో వరద ముంపుతో వరి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని, మిగతా వాణిజ్య పంటలకు, వరదల్లో ఇళ్లు, ఆస్తులు నష్టపోయిన వారికి తగు పరిహారాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎన్సీపీ తరపున కోరుతున్నట్లు బేగ్ తెలిపారు.

విజయసాయిరెడ్డి కుమార్తె అక్రమ కట్టడం కూల్చివేత

సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించినందుకు చర్యలు

విశాలాంధ్ర-భీమిలి: విశాఖపట్టణం జిల్లా భీమిలి తీరంలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ నేత విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి నిర్మించిన అక్రమ కట్టడాన్ని అధికారులు బుధవారం నేలమట్టం చేశారు. నేహారెడ్డి సీఆర్‌జెడ్ (కోస్టల్ రెగ్యులేషన్ జోన్) నిబంధనలను తుంగలో తొక్కి తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టి సముద్రంలో నిర్మించిన అక్రమ ప్రహరీని అధికారులు నేలమట్టం చేశారు. భీమిలి జోన్ పట్టణ సహాయ ప్రణాళికాధికారి డి.శ్రీనివాసరావు అధ్వరంలో జీవీఎంసీ అధికారులు ఈ కూల్చివేత చేపట్టారు. సిబ్బందితో ఉదయం 7 గంటల నుంచి బీచ్ ఒడ్డున హోటల్ కోసం వేసిన కాంక్రీట్ పిల్లర్స్, గోడలు, ఇతర అక్రమ నిర్మాణాలను తొలగించారు. కూల్చివేతలను అడ్డకుంటారన్న ఉద్దేశంతో ముందస్తుగానే భీమిలి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియ రోజంతా చేపట్టారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ముఖ్య నాయకులు విశాఖ కేంద్రంగా పెద్ద ఎత్తున భూదందా నిర్వహించారు. భూములను దౌర్జన్యంగా పెద్ద స్థాయిలో ఆక్రమించి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారని పౌర సమాజం నుంచి తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. దీంతో విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి అక్రమాలపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, మరికొందరు ఇతర పార్టీల నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. భీమిలి సర్వే నంబర్ 1516,1517,1519,1523 లో ఉన్న స్థలంలో కాంక్రీట్ నిర్మాణాలు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సీఆర్‌జెడ్‌లో అక్రమ నిర్మాణాలుపై మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ వేశారు. పిల్ నెంబర్ 53/2024లో నిర్మాణాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని కోర్టు ముందు ఉంచారు. నేహారెడ్డి అక్రమ నిర్మాణాలతో పాటు ఇతర పిటీషన్లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం తీరంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు నిర్ధారించింది. ఈ అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు అధికారులు ఈ కూల్చివేత ప్రక్రియ నిర్వహిస్తున్నారు. కూల్చివేతల పట్ల విశాఖపట్టణం నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకులు పాల్పడిన మరిన్ని భూఅక్రమాలపై చర్యలు తీసుకోవాలని వారంతా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో మావోయిస్టు నేత జగన్

విశాలాంధ్ర -చింతూరు (అల్లూరి జిల్లా): చత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా కిరణ్‌డోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత జగన్ అలియాస్ రణధీర్ మరణించినట్లు ప్రత్యేకపోలీసు అధికారి(డీఐజీ) సుందర్‌రాజ్ పట్వా వెల్లడించారు. మృతుల్లో ఆరుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు సుందర్‌రాజ్ పట్వా బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎదురుకాల్పుల్లో ఆంధ్ర ఒడిశా బోర్డర్(ఏవోబీ) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ చనిపోయారని తెలిపారు. జగన్ తెలంగాణలోని వరంగల్‌కు చెందిన వాడని, అతనిపై రూ.25 లక్షల రివార్డు ఉందని, పత్రికలకు ప్రకటనలు ఇచ్చేవాడని వెల్లడించారు. అలాగే మరో మృతుడు బీజాపూర్ ప్లాటూన్ దళ సభ్యుడు కమలేశ్‌పై రెండు లక్షల రూపాయల రివార్డు ఉందన్నారు. మలంగిర్ దళ సభ్యుడు మడివి కోసపై ఐదు లక్షల రివార్డు ఉందన్నారు. మహిళల్లో శాంతి, మడకం సుశీల, కట్టే కల్యాణ్, ముచ్చుక గంగి, లలిత, మడకం హిడిమే, కవిత మృతిచెందినట్లు చెప్పారు. వీరందరిపై ఐదు లక్షల చొప్పున రివార్డు ఉందని తెలిపారు. వారి వద్ద దొరికిన 9 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా, 2024 జనవరి నుండి ఎన్‌కౌంటర్లలో 153 మంది మావోయిస్టులు మృతి చెందారని, 669 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 656 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు.

రంగంలోకి వలంటీర్లు

ముంపు బాధితులకు ఆహారం పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎట్టకేలకు వలంటీర్లను ప్రభుత్వం రంగంలోకి దించింది. వరద ముంపు ప్రాంతాలకు అధికారులు, పోలీసులు వెళ్లలేని ప్రాంతాలకు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి బాధితులకు ఆహారం అందజేసున్నారు. ట్రాక్టర్లు, పడవల ద్వారా వలంటీర్లు వెళ్లి వారికి ఆహారం, మంచినీటి పొట్లాలను ఇస్తున్నారు. వీధి వీధికి వెళ్లి వారు స్వయంగా ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నారు. అందులో పులిహోర, తాగునీరు, పాలు, బిస్కెట్లు ఉంటున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.60లక్షల మందిని విధుల్లోకి తీసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి 50ఇళ్లకు ఒక వలంటీరు విధులు నిర్వహిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి చేరువ చేసేవారు. వాటితోపాటు ప్రజలకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను నేరుగా ఇంటి వద్దకే వచ్చి తీసుకుని, మంజూరైన తర్వాత తిరిగి వాటిని అందజేశారు. చంద్రబాబు కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో వలంటీర్లకు రూ.10వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ హామీతో చాలా మంది వలంటీర్లు కూటమికి అనుకూలంగా ఓట్లు వేసినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో దాదాపు లక్ష మంది వలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఇంకా లక్షా 60వేల మంది ఉన్నప్పటికీ, మూడు నెలల నుంచి పెన్షన్ల పంపిణీలో వారిని ప్రభుత్వం దూరం పెట్టింది. రాజీనామాలు చేసిన వారిని విధుల్లోకి తీసుకునే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం... వలంటీర్లకు రూ.10వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వడం లేదు. దీంతో వారంతా మూడు నెలల నుంచి ఆందోళనబాట పడుతున్నారు. వలంటీర్ల గౌరవ వేతనం రూ.10వేలు ఇవ్వాలని, రాజీనామాలు చేసిన వారందరినీ తిరిగి తీసుకోవాలని ప్రజా సంఘాలు ఉద్యమిస్తున్నాయి. శనివారం నుంచి విజయవాడ నగరం భారీ వర్షాలు, వరద ముంపు కారణంగా అస్తవ్యస్థంగా మారింది. నాలుగు రోజుల నుంచి ప్రజలకు ఆహార సరఫరా కరువైంది. బుడమేరు, కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో దాదాపు 4లక్షల మంది ముంపు భారీన పడగా, వారికి పూర్తి స్థాయిలో ఆహారం చేరలేదు. ప్రభుత్వ పరంగా ఆహార సరఫరాకు చర్యలు చేపట్టినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి పంపిణీకి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వలంటీర్ల సేవలనూ ప్రభుత్వం వినియోగించే పనిలో నిమగ్నమైంది. ప్రస్తుతం ఉన్న వారిని ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో కృష్ణలంక, ఊర్మిళానగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం నుంచి వలంటీర్లు ఇంటింటా తిరుగుతూ బాధితులకు ఆహారం అందజేస్తున్నారు. ఐదేళ్ల నుంచి వలంటీర్లు విధుల నిర్వహించడంతో..ఆయా కాలనీలు, ప్రాంతాలపై వారికి పూర్తిగా అవగాహన ఉంటుంది. వారి పరిధిలోని ప్రజల ఫోను నంబర్లూ అందుబాటులో ఉంటాయి. ముందుగానే వలంటీర్లతో ఆహార సరఫరా చేస్తే ఇలాంటి పరిస్థితి వచ్చి ఉండేది కాదన్న విమర్శలున్నాయి. దీనిని గుర్తించిన ప్రభుత్వం అధికారులు, పోలీసులు వెళ్లలేని ప్రాంతాలకు మాత్రమే వలంటీర్ల సేవలను ప్రస్తుతం వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. అటు అధికారులు, పోలీసులు వెళ్తున్న ప్రాంతాల్లో ఆహార సరఫరా సరిగ్గా అందడం లేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. సీఎం చంద్రబాబు సైతం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జక్కంపూడిలో ఓ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ దశలో వలంటీర్ల సేవలను ముంపు ప్రాంతాలకు పూర్తిగా విస్తరిస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతోనే తాము వలంటీర్లుగా నాడు వచ్చామని, రాజీనామా చేసిన వలంటీర్లనూ విధుల్లోకి తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సంపాదకీయం

ఓట్ల కోసమే మూక దాడులు

వసంతం వస్తోందంటే కోకిలలు కూస్తాయి. ఆకులు రాలి పోయిన చెట్లు మళ్లీ చిగురిస్తాయి. చల్ల గాలులు వీస్తాయి. మనిషి ప్రకృతికి దగ్గరవుతాడు. కానీ ఎన్నికలు వస్తే, అందులోనూ బీజేపీ అధికారానికి ముప్పు ఉందనుకునే చోటో, అధికారం సంపాదించాలనుకునే చోటో ఎన్నికలు వస్తే మూక దాడులు పెరుగుతాయి. హర్యానాలో త్వరలో ఎన్నికలు జరగవలసి ఉంది. మహారాష్ట్రలో కూడా నవంబర్‌లోగా ఎన్నికలు జరగాలి. ఈ రెండు చోట్లా ఇటీవల మూక దాడులు జరిగాయి. హర్యానాలోని ఫరీదాబాద్‌లో గోవులను దొంగిలిస్తున్నాడన్న అనుమానంపై మూకదాడుల "వీరులు" కారులో వెళ్తున్న పందొమ్మిదేళ్ల ఆర్యన్ మిశ్రాను "గో సం రక్షకులం" అని చెప్పుకునే వారు కాల్చి చంపారు. ఆ కుర్రోడు 12వ తరగతి విద్యార్థి. గో సంరక్షకులు అతడిని గోవుల దొంగ అనుకున్నారట. ఈ సంఘటన గత 23వ తేదీన జరిగితే, పోలీసులు పది రోజుల తరవాత కాని విషయం చెప్పలేకపోయారు. ఆ చెప్పిన విషయం కూడా అరకొరగా ఉంది. నిందితులెవరో, వారికి ఏ సంస్థతో, ఏ పక్షానికి చెందిన రాజకీయ నాయకులతో సంబంధంఉందో చెప్పడానికి పోలీసులు తికమక పడ్డారు. వీరు గో సంరక్షకులు అవునో కాదో పోలీసులకు తెలియదట. వారికి ఉన్న రాజకీయ సంబంధాల గురించి తెలియదట. ఆర్యన్ మిశ్రాను కడతేర్చిన కేసులో అయిదుగురిని అరెస్టు చేశారు. అనిల్ కౌశిక్, వరుణ్, సౌరభ్, క్రిషన్, ఆదేశ్ ప్రస్తుతం పోలీసుల నిర్బంధంలో ఉన్నారు. పదిరోజులు గడిచినా పోలీసులు వారినుంచి అసలు సమాచారం సంపాదించలేక పోయారట. ఆర్యన్‌ను హత మార్చిన కేసులో అయిదుగురికి గోవులను దొంగిలిస్తున్నారని సమాచారం అందిందట. మరి ఆ సమాచారం ఎవరు అందించారో కూడా ఇప్పటిదాకా రహస్యమే. ఆర్యన్ ఒక కారులో మిత్రులతో కలిసి వెళ్తున్నప్పుడు అయిదుగురు నిందితులు వేరే కార్లో వెంబడించి కాల్పులు జరిపితే ఆర్యన్ ప్రాణాలు వదిలాడు. వీళ్ల దగ్గర తుపాకీ ఎక్కడిదో కూడా పోలీసులు కనిపెట్టలేక పోయారట. గో సంరక్షక దీక్షా బద్ధులు ఇంతకు ముందు కొట్టి చంపేవారు. ఇప్పుడు తుపాకీతో కాల్చి చంపే దశకు ఎదిగారు. పోలీసులకు తెలియదేమో కానీ నిందితుల్లో ఒకడైన అనిల్ కౌశిక్ "లివ్ ఫర్ ది నేషన్" అనే సంస్థ నడుపుతాడట. ఆ సంస్థ గో సంరక్షణ పవిత్ర కర్తవ్యాన్ని నిర్వహిస్తుందట. ఆయనకు, ఆయన సహచరులకు గోవులను దొంగిలిస్తున్నారు అన్న సమాచారం అందిందట. ఈ సమాచారం ఎవరు అందించారో కూడా పోలీసులు పది రోజులైనా చెప్పలేక పోవడం విచిత్రమే. ఒక వేళ ఆర్యన్ మిశ్రా గోవులను దొంగిలించే వాడే అనుకున్నా కాల్చి చంపే హక్కు ఈ మూకకు ఎవరిచ్చారు? హంతకులు ఆర్యన్ మిశ్రాకు పరిచయస్థులు కూడా కారు. అందువల్ల పాత కక్షల కారణంగా చంపారు అని తప్పుదోవ పట్టించే అవకాశమూ లేదు. ఫరీదాబాద్‌లో జరిగిన ఈ సంఘటనలో నిందితులు ప్రయాణించిన కారును, వాడిన తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకసారి జునైద్ ను హతమారుస్తారు. మరోసారి సాబిర్ ప్రాణాలు తీస్తారు. ఆర్యన్ మిశ్రా ముస్లిం కాకపోవడంవల్ల నిందితులు ఆత్మ రక్షణలో పడ్డట్టే. ఒక వేళ మిశ్రా గోవులను దొంగిలిస్తున్నాడని ఉప్పు అందినా ముస్లిం కానందువల్ల చంపి ఉండరేమో! ఆర్యన్ మిశ్రాను చంపింది గో సం రక్షకులు కారని పోలీసులు అనలేరు. కాని నిందితుల వివరాలు మాత్రం బయట పెట్టరు. వారి వెనక ఉన్న రాజకీయ నాయకులు ఏ పక్షంవారో కూడా చెప్పరు. ఇంతకు ముందు అదే హర్యానాలోని నూహ్‌లో గో సంరక్షక మూక దాడులు ఇప్పటిదాకా అక్కడి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి.

హర్యానాలో ఇలాంటి సంఘటనలు కొత్త కాదు. ఇంతకు ముందు గో మాంసం తిన్నాడని ఒక పేద ముస్లిం యువకుడిని కొట్టి చంపారు. హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ఈ మూక హత్యలను ఖండించడానికి బదులు విచిత్రమైన వాదన లేవదీశారు. "మూక దాడులు సరైనవి కాదు. కానీ ఇటీవల గోమాత మీద శ్రద్ధ పెరిగింది. గోవులను దొంగిలిస్తున్నారంటే గోవును తల్లిగా భావించే వారికి సహజంగానే ఆగ్రహం కలుగుతుంది. వారిని ఎవరు ఆపగలరు?" అని సైనీ ఎదురుప్రశ్న వేశారు. ఇటీవలే మహారాష్ట్రలో మరో సంఘటన జరిగింది. 72 ఏళ్ల ఓ ముస్లిం వృద్ధుడు రైలులో వస్తుండగా అతడు గోమాంసం తింటున్నాడని కొందరికి అనుమానం వచ్చిందట. ఇంకేముంది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అతనిమీద దాడి చేశారు. నానా హింసా పెట్టారు. అతని దగ్గర ఉన్న 2800 రూపాయలు కాజేశారు. ఆ వృద్ధుడిని హింసించిన వారు సామాన్యులు కాదు. పోలీసు విభాగంలో చేరడానికి పరీక్ష రాసి వస్తున్నారట. ఇలాంటివారు పోలీసు విభాగంలో చేరితే గో సంరక్షణ అధికారికంగానే మూక దాడుల రూపంలో జరుగుతుందేమో! ఇలాంటి దాడులు చేయడానికి ప్రధాన కారణం ముస్లింల మీద దాడి చేసినా, చంపినా తమకు అయ్యేదేమీ లేదన్న ధీమా మోదీ, యోగి ఏలుబడిలో బలపడింది. ఇలా దాడులుచేసే వారు కేవలం హతమార్చి ఊరుకోవడం లేదు. సాక్ష్యాలను చెరిపేయడం లేదు. ఆ దాడి క్రమాన్నంతా వీడియోల్లో చిత్రీకరించి విస్తృతంగా బట్వాడా చేస్తున్నారు. ఇంతకు ముందు ఓ పోలీసు ఉద్యోగి రైలులో ప్రయాణిస్తూ ఒక వ్యక్తిని కాల్చి చంపాడు. అతనికి మతి స్థిమితం లేదని ముందు ప్రచారం చేశారు. ఆ తరవాత అది సాకు అని తేలింది. ఆ పోలీసు ఇన్‌స్పెక్టర్ రైలు ప్రయాణికులకు భద్రత కల్పించవలసిన వాడు. ప్రభుత్వోద్యోగంలో ఉంటూ ప్రభుత్వం ఇచ్చిన ఆయుధాన్నే వినియోగించి ఓ ముస్లింను నిర్భయంగా చంపగలిగాడంటే మతోన్మాదం ఎంతగా తలకెక్కిందో అర్థం చేసుకోవచ్చు. ఈ మూక దాడులను 2016లో ప్రధానమంత్రి మోదీ లాంఛనంగా ఖండించారు. "నాకు ఇలాంటి వారి మీద పట్టరాని కోపం వస్తోంది. ఈ గో సంరక్షకులలో 80 శాతం మంది నకిలీలే" అని మోదీ అన్నారు. అంతకు ముందు, ఆ తరవాతే ఇలాంటి సంఘటనలు ఎన్ని జరిగినా మోదీ నోటి ముత్యాలు రాలనేలేదు. పదేళ్ల నుంచి గో సంరక్షణ పేరుతో మూక దాడులు విరివిగా సాగుతున్నాయి. గో సంరక్షక వీరులు తయారవుతున్నారు. ఇలాంటి "వీరోచిత" కార్యకలాపాలు మితి మీరుతున్నాయి. గో మాంసం ఎగుమతి చేసే వారిలో బీజేపీ నేతలే అగ్రస్థానంలో ఉన్నారు. గో మాంసంతో వ్యాపారం చేయడానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరమూ లేదు. మామూలు జనాన్ని వెర్రి వాళ్లను చేయడానికి గో సం రక్షణ అని గావు కేకలు పెడ్తుంటారు. బీజేపీ అగ్ర నాయకుల ప్రమేయం లేకుండా, ప్రోద్బలం లేకుండా మూక హత్యలు జరుగుతాయనుకోలేం.

నోటి నిండా విషమే

దాదాపు ఇరవై ఏళ్లు కాంగ్రెస్‌లో ఉండి ఆ తరవాత బీజేపీ గూటికి చేరి అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిస్వశర్మ నోరువిప్పితే చాలు విద్వేష ప్రకటనలు జలపాతంలా దూకుతుంటాయి. ఆయన డూన్‌స్కూల్‌తో సహా అనేక ప్రసిద్ధ విద్యాలయాల్లో చదువుకున్నారు. కొంతకాలం న్యాయవాద వృత్తిలో కూడా ఉన్నారు. రాజకీయ శాస్త్రంలో పి.హెచ్.డి. పట్టాకూడా సంపాదించారు. ఇన్ని అర్హతలున్నా ఆయనకు ముస్లింల మీద ఉన్న ద్వేషం అసామాన్యమైంది. బహుశా ప్రధానమంత్రి మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా నోటి నుంచి కూడా అంత విద్వేషం విని ఉండము. 2015లో అమాంతం బీజేపీలో దూకేసిన తరవాత బిశ్వశర్మ ఇక వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరమే లేకుండా పోయింది. ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీని బలోపేతంచేసే బాధ్యతను మోదీ, అమిత్ షా కలిసి ఆయనకే అప్పగించారు. మోదీ-అమిత్ షా ద్వయం ఎక్కడైనా ఇతర పార్టీలను చీల్చి ఎమ్మెల్యేలను అపహరించి, డబ్బుసంచుల ఆశచూపి అక్కడి ప్రభుత్వాలను పడగొట్టాలంటే దానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసే బాధ్యత హేమంత బిశ్వశర్మకే అప్పగిస్తారు. బీజేపీలో చేరిన దగ్గరనుంచి ఆయన ఆగడాలకు అంతే లేకుండా పోయింది. బీజేపీలో చేరిన తరవాత కొన్నాళ్లు ఆరోగ్య శాఖమంత్రిగా ఉన్నారు. 2016 అస్సాం శాసనసభ ఎన్నికల తరవాత ఆయనకు అదనంగా విద్యాశాఖ కూడా అప్పగించారు. 2022 శాసనసభ ఎన్నికల తరవాత తనకు రాజకీయ పాఠాలు నేర్పిన తరుణ్ గొగోయ్‌ని పక్కకు నెట్టి ముఖ్యమంత్రి అయిపోయారు. ఆయన చేసే హిందుత్వ రాజకీయాలు, విద్వేష ప్రకటనల మీద మోదీకి ఎంత ప్రేమో. ఆయన కార్యసాధకుడని మోదీ భావిస్తారు.

2017 నుంచి హేమంత బిశ్వశర్మ హిందుత్వ దండకాన్ని ఉచ్చైస్వరంలో వినిపిస్తూ ఉన్నారు. ఆయన నోటికి హద్దే లేదు. సైన్సు మీద తనకు అపారమైన మక్కువ ఉందని చెప్పుకునే హేమంత్ 2017 నవంబర్‌లో

ఒకే ఒక్కడు

పూర్వజన్మ పాపాలవల్లే కేన్సర్ సోకుతుంది, ఆ వ్యాధితో మరణించేవారిని దైవం శిక్షిస్తుంది అన్నారు. రోడ్డు ప్రమాదాలలో మరణించడానికి కూడా పూర్వజన్మలో చేసిన పాపాలే కారణం అని భగవద్గీత సారాన్ని బోధించడంలో దిట్ట. దీనిమీద పెద్ద గగ్గోలు చెలరేగిన తరవాత ఆయన ఈ మాటలు ఉపసంహరించుకోవడం వేరే కథ. పాపాలుచేసి వాటి ఫలితం అనుభవించే వారి గురించి బాధపడనక్కర్లేదు అని చెప్పగలిగిన పరిశుద్ధాత్ముడు శర్మ. దైవ నిర్ణయాన్ని ఎవరూ తప్పించుకోలేరని అంటారు. కేన్సర్ సోకడానికి కారణం తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు కానీ అసలు కారణం పూర్వజన్మ పాపాలే అని హేమంత బిశ్వశర్మ మోదీ స్థాయిలో అజ్ఞాన ప్రవచనకారుడు.

ఆయన వాగ్బాణాలు సామాన్యమైనవి కావు. కరోనా రెండోదశ విజృంభించినప్పుడు 2021 ఏప్రిల్‌లో అస్సాంలో కరోనా లేదని, అందువల్ల మాస్కులు ధరించవలసిన అవసరంలేదని అన్నారు. 2022 ఫిబ్రవరి 11న ఉత్తరాఖండ్‌లో ఒక ర్యాలీలో మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిజంగా రాజీవ్ గాంధీ కొడుకేనా అని మేం ఎప్పుడైనా అడిగామా అన్నారు. అప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న కె.చంద్రశేఖరరావుపై కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలను తీవ్రంగా దుయ్యబట్టారు. ఏ రకంగా చూసినా ఇది ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నవారు అనాల్సిన మాటకాదు. ఆ సమయంలో ఆయనపై ఒక కేసు కూడా నమోదు చేశారు. ఉత్తరాఖండ్ హైకోర్టు ఆయనను పిలిపించింది కానీ బీజేపీ ఖండించిన పాపాన పోలేదు.

2023 జూన్‌లో మోదీ అమెరికాలో పర్యటించినప్పుడు అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా భారత ముస్లింల మీద ఓ నిందాత్మకమైన వ్యాఖ్య చేశారు. నోరూరుకోని హేమంత బిశ్వ శర్మ వెంటనే భారత్‌లో అనేకమంది హుసేన్ ఒబామాలు ఉన్నారు అన్నారు. మధ్యప్రదేశ్‌లో ఒక ర్యాలీలో మాట్లాడుతూ 10 జనపథ్‌ను తగులబెట్టండి అని కమల్‌నాథ్‌కు ఉచిత సలహా పారేశారు. దీని మీదా కేసు దాఖలైంది. రాహుల్ గాంధీ మణిపూర్‌లో రెండుసార్లు పర్యటించినా ఒరిగేదేమీ లేదు అన్నారు. నిజమే. ఎలా ఉంటుంది? మణిపూర్ వెళ్లడానికి మోదీకి ఇప్పటికీ తీరిక దొరక లేదుగా! అస్సాంలో ముస్లింల పెళ్లిళ్ల, విడాకుల చట్టాన్ని రద్దు చేస్తానని బెదిరిస్తున్నారు. ముస్లింలకు వర్తించే ఈ చట్టంవల్ల అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు రాకముందే పెళ్లి చేసుకునే అవకాశం ఉందంటున్నారు. బాల్య వివాహాలను నిరోధించడానికే ఆ చట్టం రద్దు చేస్తారట. బెంగాలీ మాట్లాడే ముస్లింలను అస్సాంలో చాలా చిన్నచూపు చూస్తారు. వారిని మియాలు అంటారు. మూడుకోట్లు పైబడిన అస్సాం జనాభాలో 34 శాతం ముస్లింలు ఉంటారు. తనకు ముస్లిం ఓట్లు అక్కర్లేదని తెగేసిచెప్తారు. మియా ముస్లింలు అస్సాం సంస్కృతిని ఛిద్రం చేస్తున్నారని నిరాధార ఆరోపణ చేస్తారు ఆయన. ముస్లింలు అందరూ ఆయన దృష్టిలో మతోన్మాదులే. తనకు ముస్లింలు ఓటువేస్తే తాను అసెంబ్లీలోనే ఉండడట.మదర్సాలను మామూలు పాఠశాలలుగా మార్చేస్తానని, వాటిలో ఉర్దూ, అరబిక్ భాషలను బోధించడానికి అనుమతించను అనే శర్మకు కేవలం మత విద్వేషమే కాదు భాషా ద్వేషం కూడా దండిగానే ఉంది. మియా ముస్లింలు అస్సాంలో కూరగాయల ధరలు పెంచేస్తున్నారట. అస్సాంలో మదర్సాలకు శుక్రవారం సెలవునూ రద్దు చేస్తారట. అందరిలాగే వారూ ఆదివారం సెలవు తీసుకోవాలట. అక్కడికి ఆదివారం సెలవు హిందూ సంప్రదాయం అయినట్టు. దిగువ అస్సాం వారిని ఎగువ అస్సాంకు వెళ్లనివ్వనని శర్మ చెప్పే మాట నేరుగా పౌరులు దేశంలో ఎక్కడికైనా వెళ్లొచ్చు, స్థిరపడవచ్చు అన్న రాజ్యాంగ నిర్దేశానికి విరుద్ధం.

అనన్య వర్మ

రైతు సమస్యలపై సుప్రీం కమిటీ

అన్మోల్ కౌర్‌బవ, దెబ్బి జైన్

దాదాపు 9 నెలలకుపైగా రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం పంజాబ్, హర్యానా మధ్య శంభు సరిహద్దులో జాతీయ రహదారిని దిగ్బంధనంచేసి నిరసన ఉద్యమం చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి రాతపూర్వకంగా హామీ ఇచ్చినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా పంజాబ్, హర్యానా రైతులు రహదారిని దిగ్బంధనం చేసి ఆందోళన చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారంకోసం సుప్రీంకోర్టు రైతులతో చర్చించడానికి కమిటీని ఏర్పాటు చేసింది. ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు సుప్రీంకోర్టు ఈ నెల 2వ తేదీన ఉత్తర్వు జారీ చేసింది. ఈ కమిటీకి పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నవాబ్‌సింగ్ నాయకత్వం వహిస్తారు. పంటలకు కనీసమద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించాలన్న డిమాండ్‌ను నెరవేరుస్తానని మోదీ ప్రభుత్వం హామీఇచ్చి మాట తప్పింది. శంభు సరిహద్దులో రైతుల దిగ్బంధనం తక్షణం తొలగించాలని పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా హర్యానా రాష్ట్రం వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వు జారీ చేసింది.

ఉద్యమం చేస్తున్న రైతులను కలిసి దిగ్బంధనాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేయాలని కమిటీని ధర్మాసనం కోరింది. ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ట్రాక్టర్లు, ట్రాలీలు తొలగించాలని కోరవలసిందిగా ధర్మాసం కమిటీకి విజ్ఞప్తి చేసింది. అధికారులు చూపించిన ప్రదేశంలో రైతులు ఆందోళన చేయవచ్చునని ధర్మాసనం సూచించింది.

రాజకీయ పార్టీలకు రైతులు దూరంగా ఉండాలని తమ ఆందోళనను రాజకీయం చేయవద్దని సుప్రీం ధర్మాసనం సూచించింది. ఉద్యమంలో రెండు రాష్ట్రాల రైతులు గణనీయంగా ఉన్నారు. వీరంతా అణగారిన ప్రజలే. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. అందువల్ల వీరి పట్ల సానుభూతితో వ్యవహరించవలసిందేనని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. వీరి సమస్యలను పరిష్కరించేందుకు తటస్థంగా ఉండే కమిటీని నియమిస్తామని తెలిపింది. కమిటీలో హర్యానా మాజీ డీజీ పిఎస్ సంధు, అమృతసర్ జిఎన్‌డిటీలో ప్రొఫెసర్ దేవేంద్ర శర్మ, పంజాబ్ వ్యవసాయ యూనివర్సిటీ వ్యవసాయ, ఆర్థిక వేత్త డాక్టర్ సుఖపాల్ సింగ్, హిస్సార్ చరణ్‌సింగ్ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీఆర్ కంభోజి ఆహ్వానితుడిగా కమిటీ పనిచేస్తుంది. కమిటీకి పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ జడ్జి నవాబ్‌సింగ్ నాయకత్వం వహిస్తారు.

సమావేశాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ కోసం ఉన్నతాధికార కమిటీ కార్యదర్శిగా ఛైర్‌పర్సన్ నియమించాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ కార్యదర్శి పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు సంబంధించిన రైతాంగ సమస్యలపై సమావేశాన్ని నిర్వహించేందుకు సమస్యల పత్రం తయారుచేయాలని ధర్మాసనం కోరింది. వెంటనే ట్రాక్టర్లను తొలగించడానికి రైతులను కలుసుకుని విజ్ఞప్తి చేయాలని కమిటీకి సుప్రీంకోర్టు విజ్ఞప్తి చేసింది.

రెండు రాష్ట్రాల రైతుల సమస్యలను సంపూర్ణంగా తెలిసిన వ్యక్తులతోకూడిన కమిటీని ఏర్పాటుచేయాలని జస్టిస్ కాంత్ కోరారు. ఈ కమిటీలో ఉండేవారు రెండురాష్ట్రాల క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకుని ఉండాలని ధర్మాసనం అభిప్రాయపడింది. రైతుల న్యాయమైన సమస్యలను తటస్థంగా ఉండే కమిటీ చర్చిస్తుందని, ఇతరులెవ్వరూ అనవసరంగా సమస్యలను రేకెత్తించకూడదని ధర్మాసనం కోరింది. ప్రజాస్వామ్యంలో మాట్లాడేహక్కు ప్రతివారికీ ఉంటుందని అయితే రైతు సమస్యలను ఈ కమిటీ మాత్రమే చర్చిస్తుందని కోర్టు తెలిపింది. రైతులను కలిసి చర్చించిన తర్వాత వారంలోపు కమిటీ కార్యదర్శి సమస్యలతో కూడిన పత్రాన్ని తయారు చేయాలని కోర్టు ఆదేశించింది. పంజాబ్, హర్యానా హైకోర్టు సరిహద్దుల్లో దిగ్బంధనాన్ని నిలిపివేయాలని ఇచ్చిన ఉత్తర్వును సంక్షిప్తంగా వివరించారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచి రైతులు

> **సెప్టెంబరు 2వ తేదీన సుప్రీంకోర్టు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వు జారీ చేసింది. ఈ కమిటీకి పంజాబ్, హర్యాన హైకోర్టు మాజీ న్యాయమూర్తి నవాబ్‌సింగ్ నాయకత్వం వహిస్తారు. పంటలకు కనీసమద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించాలన్న డిమాండ్‌ను నెరవేరుస్తానని మోదీ ప్రభుత్వం హామీఇచ్చి మాట తప్పింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం, శంభు సరిహద్దులో రైతుల దిగ్బంధనం తక్షణం తొలగించాలని పంజాబ్, హర్యాన హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా హర్యానా రాష్ట్రం వేసిన పిటిషన్‌పై కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వు జారీ చేసింది.**

శంభు సరిహద్దులో నిరసన ఆందోళన చేపట్టారు. ముఖ్యంగా పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత హామీ కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో రెండు రాష్ట్రాలు కొన్ని పేర్లతో కూడిన జాబితాను చర్చించడానికి వీలుగా సుప్రీంకోర్టుకు అందచేశారు. పాక్షికంగానైనా రహదారికి ఉన్న అడ్డంకిని తొలగించాలని అందుకు తగిన మార్గాలను రూపొందించి రైతులతో సమావేశాలను ఏర్పాటు చేయాలని పటియాలా, అంబాలా జిల్లాల ఎస్‌పీలను, పంజాబ్, హర్యానా రాష్ట్రాల డీజీపీలను కోర్టు ఆదేశించింది. పాక్షికంగా తొలగించడం అంబులెన్స్‌లు, సీనియర్ పౌరులు, మహిళలు, విద్యార్థులు వెళ్లడానికి వీలుగా ఉంటుందని కోర్టు తెలిపింది.

ఆగస్టు 22న కోర్టు పంజాబ్, హర్యానా రాష్ట్రాలు ప్రతిపాదిత అంశాలతో కూడిన సమస్యలను కమిటీ చర్చించడానికి వీలుగా అందించాలని సుప్రీంకోర్టు కోరింది. పదేపదే ఈ సమస్యలు ముందుకు వస్తున్నందున సరైన విధంగా సామరస్యంగా వీటిని పరిష్కరించేందుకు వీలుగా కమిటీని నియమించారు. శంభు సరిహద్దులో జాతీయరహదారి దిగ్బంధనాన్ని నివారించేందుకు హర్యానా ప్రభుత్వం ఈ సంవత్సరం ఫిబ్రవరిలో ఉత్తర్వులు జారీ చేసింది. రైతులలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు తటస్థ కమిటీ ఏర్పాటుకు హర్యానా, పంజాబ్ రాష్ట్రాలు పేర్లు ఇవ్వవలసిందిగా గతంలోనే సుప్రీంకోర్టు కోరింది.

'ఐదుగురు అప్పాచెల్లెళ్లలో కళ్లులేని బుడమేరు'

మెరుగుమాల నాంచారయ్య

బెజవాడ నగరంలో సమాంతరంగా కనిపించే రెండే రెండు పెద్ద రోడ్లు కారల్‌మార్క్స్ రోడ్డు, మహాత్మాగాంధీ రోడ్డు ప్రాంతాలు ప్రస్తుత వరదల నుంచి సురక్షితంగా ఉన్నాయి. ఇది చాలా గొప్ప శుభవార్తే. మరి నిన్నమొన్నటి వానలతో ఈ మధ్యస్థ-మిడీవల్ సిటీకి ఉత్తరమో లేదా ఈశాన్యమో తెలియదు గాని ఊరు చివరి అజిత్ సింగ్ నగర్, పాయకా పురం వీటి చుట్టు పక్కల ప్రాంతాలు బుడమేరు వరద నీట్లో మునిగే ఉన్నాయి. పూర్వపు కృష్ణా జిల్లా మైలవరం దగ్గర ఖమ్మం జిల్లా కొండల్లో పుట్టిందని చెబుతున్న ఈ ఏరు (రివులెట్) నేను పుట్టిన పునాది పాడుకు, నేను పెరిగిన గుడివాడ టౌనుకు పది పన్నెండు కిలోమీటర్ల దూరంలో సమాంతరంగా ముందుకు ప్రవహిస్తూ పూర్వపు పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో విస్తరించి ఉన్న అతి పెద్ద సరస్సు కొల్లేరులో కలుస్తుంది. భారీ వర్షాల సమయంలో ఈ బుడమేరు పుట్టగుంట గ్రామం దగ్గర మా గుడివాడ నుంచి ఏలూరు లేదా హనుమాన్ జంక్షన్ పోయే రోడ్డు మీద నుంచి కాస్త దూకుతూ ప్రవహిస్తుంది. అప్పుడు ఈ రహదారిపై రాకపోకలు బంద్ అవుతాయి.

1970-72 మధ్య మేము హైస్కూల్లో చదివే రోజుల్లో- ఉప్పొంగిన బుడమేరు రోడ్డుపై నుంచి (ఇప్పుడు ఈ గుడివాడ - ఏలూరు రోడ్డు జాతీయ రహదారి 216 కత్తిపూడి -ఒంగోలు అయింది) అతి వేగంగా దూకుతూ పోవడం చూడ్డానికి సైకిళ్లేసుకుని అక్కడకు వెళ్లే వాళ్లం. గతంలో ఈస్ట్ కృష్ణాగా పిలిచే ఈ ప్రాంతానికి బుడమేరు అందరికీ బాగా తెలిసిన ఏరు. ఏలూరు పట్టణానికి



తమ్మిలేరు ఎలాగో ఈ ఏరియాకు బుడమేరు అలాంటి దుందుడుకు ప్రవాహం. అలాగే ఇది డ్రెయిన్ కూడా. విజయవాడ -గుడివాడ రైల్వేలైను మధ్య వచ్చే తరిగొప్పుల స్టేషన్ దగ్గరలోని వేంపాడు, వెల్దిపాడు పక్క నుంచి పోయే బుడమేరు వరద నీటిలో అక్కడి పొలాలు అప్పట్లో మునిగి పోయేవి. ఈ మునక ముప్పు నుంచి అక్కడి పొలాలను కాపాడడానికి ఆ ప్రాంతంలో బుడమేరుకు 40 ఏళ్ల క్రితమే కరకట్ట నిర్మాణం పెద్ద వార్త. వైసీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్ కట్టించాడని చెబుతున్న బెజవాడ కృష్ణానది రిటెయినింగ్ వాల్ (ఐదారు కి.మీ పొడవున) ఇప్పుడు ఎంతటి చర్చనీయాంశం అయిందో అప్పట్లో బుడమేరు కరకట్ట కట్టడం గురించి అంతగా ఆ ఊళ్ల జనం చెప్పుకునే వారు.



గుడివాడ నుంచి బెజవాడ వెళుతుంటే సత్యనారాయణ పురం రైల్వే స్టేషన్ దాటాక విజయవాడ జంక్షన్ స్టేషన్ రావడానికి ముందు బుడమేరు రైలు వంతెన కింద నుంచి పోయేదని గుర్తు. (ఇప్పుడు సత్యనారాయణ పురం రైల్వే లైను లేదు) అలాగే, అప్పట్లో ఒకవేళ ప్లాట్‌ఫాంలు ఖాళీ లేకపోతే రామవరప్పాడు నుంచి, ఏలూరు నుంచి వచ్చే రైళ్ల మార్గంలో ('బైపాస్') మా రైలు సింగ్ నగర్, పాయకాపురం మీదుగా బెజవాడ పెద్ద స్టేషన్ చేరేది. ఈ రూట్లో కూడా బుడమేరు వచ్చేది. ఇంతగా ఈ ఏరు ఇష్టమొచ్చిన రీతిలో వంపులు తిరుగుతూ పోతుంది. అజిత్‌సింగ్ నగర్, పాయకా పురం, న్యూరాజరాజేశ్వరీ పేట పక్క నుంచి బుడమేరు ప్రవహిస్తుంది. బుడమేరు వరద నీటితో ఉప్పొంగితే - ఈ ప్రాంతాలన్నీ నీట మునగడం ఎప్పటి నుంచో జరుగుతున్నదే. మిగిలిన అన్ని పెద్ద వాగులు లేదా ఏరుల మాదిరిగానే బుడమేరు కూడా ఎన్నెన్నో వంకర్లు తిరుగుతూ తన గమ్య స్థానం కొల్లేరు చేరుతుంది. దాదాపు 162 కిలోమీటర్ల ప్రయాణం ఈ ఏరుది. మైలవరం ప్రాంతంలోని వెలగలేరు వద్ద బుడమేరుపై అడ్డుకట్ట వేసి బుడమేరు డైవర్షన్ కాలవ (బీడీసీ) తవ్వారు. దాని నీటిని ఇలా సాగు అవసరాలకు వాడడం కొన్నేళ్ల క్రితమే మొదలైందని, ఈ కాలవను తర్వాత గోదావరి నుంచి నీరు తీసుకొచ్చి కృష్ణా నదిలో కలిపే కాలవతో అనుసంధానం చేశారని మొన్ననే చదివాను. పదేళ్ల క్రితం ఇప్పటిలాగానే బుడమేరు వరదలతో బెజవాడ ఊరు చివరి ప్రాంతాలు నీట మునిగినప్పుడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్, టైమ్స్‌ఆఫ్ ఇండియా వంటి ఆంగ్ల పత్రికలు కాస్త పెద్దగానే ఆ వార్తలు వేశాయి.

గూగుల్‌లో వెతికితే ఈ వార్తలు కనిపించాయి. ఈ ఆంగ్ల పత్రికలు రాసినట్టు బుడమేరుకు 'బెజవాడ దుఃఖ దాయిని' అనే పేరుందని నాకు ఈ పత్రికల వార్తలు చదివే దాకా తెలీదు. ఎప్పుడో చిన్నప్పుడు స్కూలు సోషల్ స్టడీస్ పాఠాల్లో 'హొయాంగ్ హొ నదిని చైనా దుఃఖదాయిని అంటారని చదువుకున్న విషయం వెంటనే గుర్తుకొచ్చింది. అన్నింటికీ మించి ఈ వంకరు టింకరు బుడమేరు ప్రవాహం లేదా ప్రయాణం గురించి నాకు పది పన్నెండేళ్ల వయసులో బుడమేరు సమీప గ్రామం పునాదిపాడులో పద్నాలుగేళ్లు పెరిగిన మా అమ్మ పిన్నిబోయిన సంపూర్ణాన్ని అడిగాను. అప్పుడామె, "బుడమేరు చూపులేని మనిషిలా వెనక్కీ ముందుకీ వంకర్లు తిరుగుతూ పోతుంది. చివరికి కొల్లేరులో కలిసే దాకా ఎక్కడా రెండు ఫర్లాంగులు సక్కంగా పోదు. తమ్మిలేరు సహా ఐదుగురు అప్పాచెల్లెళ్లలో ఒకటి బుడమేరు. ఈ ఐదుగురిలో కళ్లు లేనిది బుడమేరు. అందుకే అడ్డదిడ్డంగా ఇది పారుతుంది. నాకీ విషయం బుడమేరుకు దగ్గర్లోని ఉప్పులూరులో పుట్టిన మా అమ్మమ్మలు (నాయనమ్మలు) నా చిన్నప్పుడే చెప్పారయ్యా," అని చిన్న కత లాగా చెప్పింది. అవును, ప్రభుత్వాలకు మొదట్నించీ ముందు చూపు తక్కువ ఉన్నట్టే బుడమేరు పుట్టినప్పటి నుంచీ అసలు చూపే లేదని, కళ్లు లేవని- ఇప్పటి దాని దూకుడు, బీభత్సం చూస్తే నాకు అర్థమవుతోంది.

మహిళల భద్రతకు చర్యలు తప్పనిసరి: కనిమొళి

చెన్నై: పని ప్రదేశంలో వేధింపుల నుంచి మహిళలను కాపాడాల్సిన అవసరం ఉందని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. తమకు భద్రత కల్పించాలని మహిళలు కోరడంలో ఎలాంటి తప్పు లేదని ఆమె పేర్కొన్నారు. కనిమొళి బుధవారం చెన్నైలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. మహిళలపై ఏ రకమైన వేధింపులు జరగకుండా నిరోధించడం ముఖ్యమని చెప్పారు. పని ప్రదేశాల్లో మహిళలను కాపాడుకోవాలని, ఇది మనందరి కర్తవ్యమని ఆమె పేర్కొన్నారు.దేశంలో ఎక్కడ చూసినా మహిళలపై అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలు బాధితులుగా ఉంటున్నారన్నారు.

బాలిక కిడ్నాప్... సామూహిక అత్యాచారం

పాట్నా: ఇద్దరు కిరాతకులు ఓ బాలికను కిడ్నాప్ చేశారు. ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత బాలికను హత్య చేశారు. మృతదేహాన్ని నదిలో పడేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు ఆ ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. బీహార్‌లోని గయా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న ఆరేళ్ల బాలికను ఆ ఇద్దరు కిడ్నాప్ చేశారు. ఒకచోటకు తీసుకెళ్లి సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత బాలికను చంపిన కిరాతకులు ఆ చిన్నారి మృతదేహాన్ని సమీపంలోని మోర్హర్ నదిలో పడేశారు. బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఉచిర్వాన్ గ్రామంలోని మోర్హర్ నది ఒడ్డున బాలిక మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బాలిక మృతదేహాన్ని వెలికి తీసి పోస్ట్‌మారం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు తొలుత ఒక నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడు ఇచ్చిన సమాచారంతో మరో నిందితుడ్ని కూడా అరెస్ట్ చేశారు. వారిని ప్రశ్నించడంతో నేరం అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నన్ను, నా సోదరిని వేధించారు'

కోల్‌కతాలో మహిళ ఫిర్యాదు

కోల్‌కతా: వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న వేళ కోల్‌కతాలో మరో దారుణం చోటుచేసుకుంది. నగరంలోని ఓ లగ్జరీ ఫైవ్ స్టార్ హోటల్‌లో ఇద్దరు మహిళలపై వేధింపులకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. హోటల్‌లో జరిగిన పార్టీలో మంగళవారం రాత్రి 11.50 గంటల సమయంలో నిందితులు తనను, తన సోదరిని వేధించారని, అనుచితంగా టచ్ చేసి బెదిరించారని ఆరోపిస్తూ బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను ఢిల్లీకి చెందిన అరుణ్ కుమార్ (60), కోల్‌కతాకు చెందిన రింకూ గుప్తా (43)గా గుర్తించారు. మహిళలపై దారుణాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'అపరాజిత బిల్లు'ను ఆమోదించిన రోజే ఈ దారుణం జరగడం విశేషం.

రాజీవ్ కన్నా రాహుల్ మేధావి, వ్యూహకర్త

శ్యామ్ పిట్రోడా

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ... తన తండ్రి రాజీవ్‌గాంధీ కన్నా తెలివితేటలున్న మేధావి, వ్యూహకర్త అని చిరకాల గాంధీ కుటుంబ సన్నిహితుడు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ శ్యామ్ పిట్రోడా పేర్కొన్నారు. అయితే ఇద్దరు నాయకులను భారతదేశ ఆలోచనకు సంరక్షకులుగా ఆయన అభివర్ణించారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పిట్రోడా మాట్లాడుతూ... లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి కాబోయే ప్రధానికి ఉండాల్సిన అన్ని లక్షణాలు ఉన్నాయని స్పష్టం చేశారు. వచ్చే వారం రాహుల్ గాంధీ అమెరికా పర్యటనపై మాట్లాడుతూ... తన అధికారిక హెూదాలో రాహుల్ అమెరికాకు రావడంలేదని చెప్పారు. అయితే క్యాపిటల్ హిల్‌లో వ్యక్తిగతంగా వివిధ రంగాల ప్రముఖులు, మేధావులతో సంభాషించే అవకాశం ఉంటుందని చెప్పారు. 'అతను (రాహుల్ గాంధీ) కచ్చితంగా నేషనల్ ప్రెస్ క్లబ్‌లో ప్రెస్‌తో సంభాషిస్తారు. మేధావులతో సమావేశమవుతారు. జార్జిటౌన్ విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తారు" అని పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాహుల్ తొలిసారిగా అమెరికా పర్యటనకు వెళుతున్నారు. రాహుల్ గాంధీ సెప్టెంబరు 8-10 తేదీల మధ్య అమెరికాలో పర్యటించనున్నారు, ఈ సందర్భంగా టెక్సాస్, జార్జిటౌన్ విశ్వవిద్యాలయాలు సహా వాషింగ్టన్ డీసీ, డల్లాస్‌లలో జరిగే సమావేశాల్లో పాల్గొంటారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీ మధ్య సారూప్యతలు, విభిన్న లక్షణాల పై గురించి అడిగిన ప్రశ్నకు పిట్రోడా స్పందిస్తూ...'నాకు చాలా మంది ప్రధాన మంత్రులను చాలా దగ్గరి నుండి చూసే అవకాశం లభించింది. అయితే రాహుల్, రాజీవ్ మధ్య వ్యత్యాసం ఏమిటంటే రాహుల్ అత్యం మేధావి, ఆలోచనాపరుడు.

రాజీవ్ కొంచెం ఎక్కువ పని చేసేవాడు. అయితే వారికి ప్రజల పట్ల ఒకే విధమైన ఆందోళనలు, భావాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ మెరుగైన భారతదేశాన్ని నిర్మించాలని వారు విశ్వసిస్తారు. వారు నిజమైన సాధారణ వ్యక్తులు. వారికి పెద్దగా వ్యక్తిగత అవసరాలు లేవు' అని కాంగ్రెస్ పిట్రోడా చికాగో నుండి పీటీఐకి చెప్పారు.

కాంగ్రెస్‌తో పొత్తు అవశ్యం

ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్: కాంగ్రెస్‌తో తమ పార్టీ పొత్తు బలవంతం కాదని...జమ్మూకశ్మీర్ అభివృద్ధి, కేంద్ర పాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి ఈ సమయంలో అవసరమని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. జమ్మూ కశ్మీర్‌లోని ప్రధాన పార్టీల నాయకులను పాకిస్థానీలు లేదా ఖలిస్థానీలుగా విమర్శలు చేసేవారికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కశ్మీర్ పర్యటన చెంపదెబ్బ అని అబ్దుల్లా అన్నారు. జమ్మూలోని రాంబన్ జిల్లా బనిహాల్‌లో జరిగే రాహుల్ ఎన్నికల సభలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయల్దేరిన అబ్దుల్లా... విలేకరులతో మాట్లాడారు. 'అతను (రాహుల్) మన దేశానికి పెద్ద గొంతుక. మమ్మల్ని పాకిస్థానీలు లేదా ఖలిస్తానీలు అని నిందించిన వారి ముఖం మీద ఇది చెంపదెబ్బ. మేము రాష్ట్రం (జమ్మూకశ్మీర్) రావాలని కోరుకుంటున్నామని దేశ ప్రజలు అర్థం చేసుకుంటారని నేను ఆశిస్తున్నాను. ఒక రాష్ట్రం కేంద్రపాలిత ప్రాంతంగా మారడాన్ని నేను మొదటిసారి చూశాను. పూర్తి రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలి' అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్‌కు వ్యతిరేకంగా పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ చేసిన ప్రకటనలపై వ్యాఖ్యానించడానికి అబ్దుల్లా నిరాకరించారు. 'ఆమె వివిధ విషయాలపై అర్థంలేని వాదన చేస్తూనే ఉన్నారు' అన్నారు.

ముందుగానే సీఎం అభ్యర్థిని ప్రకటించం

శరద్ పవార్

కొల్హాపూర్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) నుంచి ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాల్సిన అవసరం లేదని కూటమిలో భాగస్వామ్య పక్షమైన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి శరద్ పవార్ స్పష్టం చేశారు. బుధవారం కోల్హాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల తర్వాత ముఖ్యమంత్రి ఎవరన్నది నిర్ణయిస్తామని అన్నారు. కూటమిలో ఏ పార్టీకి అధిక సీట్లు వస్తాయో ఆ పార్టీ నుంచే ముఖ్యమంత్రి అభ్యర్థిని నిర్ణయిస్తామని ఆయన తెలిపారు. సాధ్యమైనంత త్వరగా సీట్ల సర్దుబాటు ఒప్పందం కుదుర్చుకుని ఎన్నికల ప్రచారానికి వెళ్లాలని తాను ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 7 నుంచి 9వ తేదీ లోపు ఎంవీఏ నాయకులు కూర్చుని సీట్ల పంపకాన్ని ఖరారు చేయాలని ఆయన సూచించారు. నవంబర్ రెండవ వారం నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని తాను ఊహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శివసేన(యూబీటీ), ఎన్‌సీపీ(ఎస్పీ), కాంగ్రెస్‌తో కూడిన ఎంవీఏ జరిపే చర్చలలో సీపెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ(పీడబ్ల్యూపీ), సీపీఐ, సీపీఎంను కూడా చేర్చుకోవాలని ఆయన కోరారు. ఈ పార్టీలకు కొన్ని ప్రాంతాలలో బలం ఉందని, లోక్‌సభ ఎన్నికలలో ఈ పార్టీలు ఎంవీఏకి సాయపడ్డాయని పవార్ చెప్పారు.

యోగి బుల్డోజర్‌కు గుణపాఠం తప్పదు

అఖిలేశ్

న్యూఢిల్లీ: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ బుల్డోజర్లతో ప్రజలను భయపెడుతున్నారని, నిర్దాక్షిణ్యంగా ప్రజల ఇళ్లు కూల్చివేస్తున్నారని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. అఖిలేశ్ బుధవారం లక్నోలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ సీఎం నివాస మ్యాప్‌నకు ఆమోదం ఉందా అని ప్రశ్నించారు. దాన్ని ఎప్పుడు ఆమోదించారో... పత్రాలు చూపాలని అఖిలేశ్ నిలదీశారు. కేవలం ప్రతీకారం కోసమే యోగి బుల్డోజర్లు ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యర్థులను భయపెట్టేందుకు బుల్డోజర్లు దించుతున్నారన్నారు. బుల్డోజర్లను ప్రయోగించరాదని నిన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని అఖిలేశ్ యాదవ్ గుర్తు చేశారు. ఇప్పటివరకూ బుల్డోజర్లతో ధ్వంస రచన సాగించినందుకు ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బుల్డోజర్ నడిపేందుకు మెదడు అవసరం లేదని, స్టీరింగ్ ఉంటే చాలని అన్నారు. ఓ వ్యక్తి బుల్డోజర్ స్టీరింగ్‌ను యూపీ ప్రజలు మార్చేస్తారని అఖిలేశ్ స్పష్టం చేశారు. కాగా, మహిళలపై నేరాల విషయంలో యూపీ ముందువరసలో ఉందని అఖిలేశ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు సరిగ్గా పనిచేయకపోవడంతో మహిళలపై వేధింపులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు సహా ప్రతి ఒక్కరి భద్రతకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు.

బుల్డోజర్ సంస్కృతి అరికట్టాలి

యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో బుల్డోజర్ సంస్కృతి న్యాయవ్యవస్థకు అనుగుణంగా లేదని, దానిని అరికట్టాలని కాంగ్రెస్ నేత అజయ్‌రాయ్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉక్కుపిడికిలి పాలనకు ప్రతీకగా మారిన బుల్డోజర్‌ను ఉపయోగించడంపై అఖిలేశ్ యాదవ్, యోగి ఆదిత్యనాథ్ మధ్య జరిగిన వాగ్వాదం నేపథ్యంలో కాంగ్రెస్ యూపీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేశారు. నిందితులను ఇళ్లను కూల్చివేసేందుకు బుల్డోజర్‌లను ఉపయోగించడాన్ని సుప్రీం కోర్టు సోమవారం తప్పుపట్టడంతో ఇద్దరు నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాయ్ తన వంతుగా సుప్రీం తీర్పును ప్రశంసించారు. చట్టబద్ధమైన పాలనను కచ్చితంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. 'సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వును మేము స్వాగతిస్తున్నాం. ప్రజలకు న్యాయం జరిగేలా ఏ నిర్ణయమైనా న్యాయవ్యవస్థ ప్రకారం ఉండాలి. న్యాయవ్యవస్థలో బుల్డోజర్లకు స్థానం లేదు' అని రాయ్ ఇక్కడ పీటీఐకి ఇచ్చిన ఒక వీడియో ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 2027 తర్వాత సీఎం సొంత జిల్లా అయిన గోరఖ్‌పూర్‌కు అన్ని బుల్‌డోజర్‌లను ఆర్డర్ చేస్తానన్న అఖిలేశ్ యాదవ్ బెదిరింపులకు ఆదిత్యనాథ్ అంతకు ముందు రోజు తీవ్రంగా ప్రతిస్పందించారు. అందరికీ బుల్డోజర్‌లను నిర్వహించే హృదయం ప్రతి ఒక్కరికీ ఉండదు' అని అన్నారు. 'అందరి చేతులు బుల్‌డోజర్‌పై సరిపోవు. దీనికి 'హృదయం, ఆలోచన' రెండూ అవసరం' అని ఆదిత్యనాథ్ అన్నారు. కాగా, అఖిలేశ్ మంగళవారం ఒక ప్రకటనలో '2027లో సమాజ్ వాదీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొత్తం రాష్ట్రంలోని బుల్డోజర్లు గోరఖ్‌పూర్ వైపు వెళతాయి' అని తెలిపారు. న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్. కె.వి.విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ సందర్భంగా ఇలా వ్యాఖ్యానించింది. 'ఎవరైనా ఒక నిందితుడు అయితే మాత్రమే అతని ఇంటిని ఎలా కూల్చివేస్తారు? అతను దోషి అయినప్పటికీ, చట్టం నిర్దేశించిన విధానాన్ని అనుసరించకుండా చేయలేం' అని తెలిపారు. ఇదిలాఉండగా, బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి మంగళవారం సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించారు. దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన విషయంలో మార్గదర్శకాలను నిర్దేశిస్తామని చెప్పారు.

తీవ్రవాద గ్రూపులతో

త్రిపుర ప్రభుత్వం శాంతి ఒప్పందం

ఈశాన్య రాష్ట్రాల్లో హింసకు ముగింపు : హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ : హింసను అంతం చేసి, ఈశాన్య రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు బుధవారం ఇక్కడ కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమక్షంలో కేంద్ర, త్రిపుర ప్రభుత్వాలు, రాష్ట్రంలోని రెండు తిరుగుబాటు గ్రూపుల మధ్య శాంతి ఒప్పందం జరిగింది. నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఎన్ఎల్ఎఫ్‌టీ), ఆల్ త్రిపుర టైగర్ ఫోర్స్ (ఎన్ఎల్ఎఫ్‌టీ) ప్రతినిధులతో ఒప్పంద పత్రంపై సంతకం సందర్భంగా త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా హాజరైన వారిని ఉద్దేశించి హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఈశాన్య ప్రాంతంలో శాంతి, అభివృద్ధికి మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. 'ఈశాన్య ప్రాంతంలో సంతకం చేసిన అన్ని శాంతి ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేసింది' అని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 2,500 కోట్ల అభివృద్ధి ప్యాకేజీని ఈశాన్య రాష్ట్రాల్లో అమలు చేసినట్లు చెప్పారు. తీవ్రవాదం, హింస లేని అభివృద్ధి చెందిన ఈశాన్య రాష్ట్రంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృష్టిని నెరవేర్చడానికి ఎంహెచ్ఏ అవిశ్రాంతంగా కృషి చేస్తోందని షా అన్నారు. ఈశాన్య ప్రాంతంలో శాంతి, శ్రేయస్సును తీసుకురావడానికి ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రభుత్వం 12 ముఖ్యమైన ఒప్పందాలపై సంతకం చేసిందని, వాటిలో మూడు త్రిపురకు సంబంధించినవి అని ఆయన వివరించారు. ఈ ఒప్పందాల వల్ల దాదాపు 10,000 మంది ఆయుధాలు వదులుకుని జనజీవన స్రవంతిలో చేరారని తెలిపారు.

అసోంలో రూ.22 వేల కోట్ల ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్

గువహతి: ఒకటికి పదింతలు లాభం వస్తుందంటూ మభ్యపెట్టి ప్రజలను నిలువునా దోపిడీ చేస్తోన్న ఆన్‌లైన్ భారీ కుంభకోణం ఒకటి అసోంలో వెలుగులోకి వచ్చింది. తాజాగా రాష్ట్ర పోలీసులు రూ. 22 వేల కోట్ల కుంభకోణం గుట్టు రట్టు చేశారు. పెట్టుబడిని రెట్టింపు చేస్తామంటూ స్టాక్‌మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ల పేరిట ప్రజల నుంచి మోసగాళ్లు సొమ్ము సమీకరించారు. ఈ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఇలాంటి మోసపూరిత పెట్టుబడులకు దూరంగా ఉండాలని సీఎం హిమంత బిశ్వశర్మ ప్రజలను హెచ్చరించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... ఈ కేసులో 22 ఏళ్ల విశాల్ ఫుకాన్, స్వప్నిల్ దాస్ అరెస్టయ్యారు. డిబ్రూగఢ్ నుంచి విశాల్‌ను, గువహతి నుంచి స్వప్నిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. విశాల్ విలాసవంతమైన జీవనశైలి గడిపేవాడని, దానిని చూపించే ప్రజలు పెట్టుబడులు పెట్టేలా మభ్యపెట్టాడని పోలీసులు వెల్లడించారు. 60 రోజుల్లో పెట్టుబడులపై 30 శాతం రాబడి వస్తుందని నమ్మబలికాడు. నాలుగు నకిలీ సంస్థలను స్థాపించి... అసోం చిత్ర పరిశ్రమలో పెట్టుబడులు పెట్టాడు. భారీగా ఆస్తులు కూడబెట్టాడు. తమకు అందిన ఫిర్యాదుల ఆధారంగా అతడి నివాసంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ కుంభకోణానికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై హిమంత మాట్లాడుతూ 'ఆన్‌లైన్ ట్రేడింగ్ సంస్థల ద్వారా స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే వ్యవస్థ ఏదీ లేదు. మోసగాళ్లు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి. మధ్యవర్తులపై కేసులు నమోదయ్యాయి. ఆ కుంభకోణం మొత్తాన్ని కూకటివేళ్లతో పెకిలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని సీఎం వెల్లడించారు. కొన్ని ఆన్‌లైన్ ట్రేడింగ్ సంస్థలు... సెబీ, ఆర్‌బీఐ మార్గదర్శకాలు అనుసరించకుండా వ్యాపారం నిర్వహిస్తున్నాయని చాలా నివేదికలు వెలువడిన నేపథ్యంలో ఆయన స్పందించింది. కుంభకోణానికి సంబంధించి మరికొన్ని అరెస్టులు చోటుచేసుకోనున్నాయని పోలీసులు తెలిపారు.

వయనాడ్ పునరావాసానికి రాహుల్ నెల వేతనం

తిరువనంతపురం: ప్రతిపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఇటీవల కుంభవృష్టితో తీవ్రంగా దెబ్బతిన్న కేరళలోని వయనాడ్ కోసం ఒక నెల వేతనాన్ని (రూ. 2.3 లక్షలు) విరాళంగా ఇచ్చినట్లు ఆ రాష్ట్ర పార్టీ కమిటీ పేర్కొంది. దీనిని తాము బాధితుల పునరావాస కార్యక్రమాల్లో వినియోగిస్తామని బుధవారం వెల్లడించింది. కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం.లిజు ఈ విషయంపై స్పందిస్తూ బాధితుల కోసం తమ పార్టీ విరాళాలు సేకరిస్తోందని, దీనికి రాహుల్ కూడా తన వంతు సాయం అందించారని వెల్లడించారు. వయనాడ్‌లో బాధితులకు కాంగ్రెస్ 100 ఇళ్లు నిర్మించాలని తలపెట్టిందని పేర్కొన్నారు.

పార్టీ విరాళాల సేకరణ కోసం ప్రత్యేకంగా 'స్టాండ్ విత్ వయనాడ్ - ఐఎన్‌సీ' అనే యాప్‌ను తయారు చేసింది. పునరావాస కార్యక్రమాల పురోగతిని కాంగ్రెస్ ఎంపీ సుధాకరన్ పర్యవేక్షిస్తున్నట్లు ఎం.లిజు వెల్లడించారు. 'కాంగ్రెస్ నాయకులు, మద్దతుదారులు, నేతల నుంచి మొబైల్ యాప్ ద్వారా విరాళాలు వస్తున్నాయి. ఒక్కసారి బ్యాంక్ ఖాతాలోకి డబ్బులు చేరిన తర్వాత దాతలకు ఎస్ఎంఎస్‌లో సమాచారం అందుతుంది. కేపీసీసీ అధ్యక్షుడు కె.సుధాకరన్, ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ డిజిటల్ సంతకాలతో రసీదు కూడా వారికి చేరుతుంది' అని పేర్కొన్నారు. వయనాడ్‌లో కాంగ్రెస్ తరపున సహాయ కార్యక్రమాలు పర్యవేక్షించేందుకు వీలుగా తొమ్మిది మందితో కమిటీని ఏర్పాటు చేశారు. విరాళాల సేకరణ నుంచి వయనాడ్ మండల కమిటీని మినహాయించారు.

మణిపూర్ డ్రోన్ దాడుల కలకలం

భారీగా ఎన్ఎస్‌జీ నిపుణుల తరలింపు

కోహిమా: దాదాపు 16 నెలలుగా జాతుల ఘర్షణలతో రగులుతున్న మణిపూర్ హింస ప్రమాదకర మలుపు తిరిగింది. తాజాగా మిలిటెంట్లు ఎన్నడూ లేనివిధంగా డ్రోన్లతో బాంబులు జారవిడవడం మొదలుపెట్టడంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఈ ధోరణి విస్తరించకముందే దాన్ని అదుపు చేసేందుకు ఎన్ఎస్‌జీ (జాతీయ భద్రతా దళం) నిపుణులను రంగలోకి దించినట్లు తెలుస్తోంది. 'ఇది జాతుల ఘర్షణల్లో మరో కొత్తకోణం. ఈ అంశంపై మేము ఎన్ఎస్‌జీ డైరెక్టర్ జనరల్, ఆయన బృందంతో చర్చించాం. ఆ దళం నిపుణులు ఇక్కడికి రానున్నారు. డ్రోన్ల దాడులను నివారించేందుకు మేం చర్యలు చేపడుతున్నాం' అని మణిపూర్ డీజీపీ రాజీవ్‌సింగ్ వెల్లడించారు. గతేడాది మే నుంచి ఇక్కడ జరుగుతున్న దాడుల్లో 225 మంది మరణించగా... వందల మంది గాయపడ్డారు. వేల మంది నిరాశ్రయులయ్యారు. పర్వత - మైదాన ప్రాంత ప్రజలుగా విడిపోయారు. తాజాగా సాయుధ డ్రోన్లు మిలిటెంట్ల చేతికి వచ్చాయి. దీంతో ఇక్కడ శాంతి కోసం భద్రతా దళాలు చేస్తున్న ప్రయత్నాలకు భారీగా గండి పడనుంది. దాదాపు 60 వేల మంది కేంద్ర బలగాల సిబ్బందిని ఇప్పటికే ఆ రాష్ట్రంలో మోహరించారు. తాజాగా మేకాంగ్ గ్రామంలో జరిగిన డ్రోన్ దాడుల్లో మూడు ఇండియన్ రిజర్వు బెటాలియన్ల బంకర్లు దెబ్బతిన్నాయి. ఇక్కడి నుంచి వారు ఇన్సాస్, ఏకే 47, లైట్ మెషిన్‌గన్‌లను మిలిటెంట్లు అపహరించారు. ఈ దాడులకు వాడినవి రోటర్ ఫిటెడ్ క్వాడ్‌కాప్టర్లుగా గుర్తించారు. వీటిని సాధారణంగా ఫొటోలు తీయడానికి వినియోగిస్తారు. వీటిల్లో మార్పులు చేసి దాడికి వాడినట్లు భావిస్తున్నారు.

స్టెయిన్‌లెస్ స్టీల్ వాడితే కూలేది కాదు: గడ్కరీ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిన ఘటనపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ విగ్రహం తయారీకి స్టెయిన్‌లెస్ స్టీల్ వాడితే... అది ఎప్పటికీ కూలి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. సముద్ర తీరానికి దగ్గరగా నిర్మించే బ్రిడ్జిల నిర్మాణంలో స్టెయిన్‌లెస్ స్టీల్ వినియోగించాలని ఆయన సూచించారు.

'నేను రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు ముంబైలో 55 ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపట్టాం. ఆ సమయంలో ఓ వ్యక్తి నాకు వాటిని చూపించడానికి తీసుకువెళ్లాడు. అక్కడ వారు ఇనుపకడ్డీల మీద కొన్ని పౌడర్-కోటింగ్‌లు వేస్తూ అవి మళ్లీ తుప్పు పట్టే అవకాశం లేదని చెప్పారు. కానీ అవి తుప్పు పట్టే అవకాశం ఉందని నేను అప్పుడే చెప్పాను. సముద్రానికి దగ్గరగా నిర్మించే వంతెనల నిర్మాణంలో స్టెయిన్‌లెస్ స్టీల్ ఉపయోగించాలని మూడేళ్లుగా ఒత్తిడి చేస్తూనే ఉన్నాను. శివాజీ విగ్రహాన్ని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారుచేసి ఉంటే అది కూలిపోయేది కాదు' అని గడ్కరీ అన్నారు.

సిద్ధరామయ్య రాజీనామా తప్పదు: యడియూరప్ప



శివమొగ్గ: మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా)లో అక్రమాల వ్యవహారం కర్నాటక రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా శివమొగ్గలో మాజీ సీఎం, బీజేపీ సీనియర్ నేత యడియూరప్ప మాట్లాడారు. హైకోర్టు తీర్పు వెల్లడికాక ముందే సీఎం సిద్ధరామయ్య గౌరవంగా తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ వ్యవహారంపై సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాత్ అనుమతించడంపై కోర్టు తీర్పు తర్వాత సిద్ధరామయ్య రాజీనామా చేసే పరిస్థితి వస్తుందని తెలిపారు. 'కోర్టు తీర్పు తర్వాత నూటికి నూరు శాతం సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వస్తుంది. ఆలోగా సీఎం పదవికి గౌరవంగా రాజీనామా చేయాలని సలహా ఇస్తున్నా. సిద్ధరామయ్య చేసిన మోసాలన్నీ రుజువైనందున... ఆయన తప్పించుకొనే అవకాశం లేదు' అని వ్యాఖ్యానించారు. కోవిడ్-19 మేనేజ్‌మెంట్‌లో జరిగిన అవకతవకలపై కర్నాటక హైకోర్టు విశ్రాంత జడ్జి నేతృత్వంలోని విచారణ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గురువారం జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందన్న వార్తలపైనా యడియూరప్ప స్పందించారు. 'ఇందులో అర్థం లేదు. ఏ నిర్ణయమైనా తీసుకొనే స్వేచ్ఛ మంత్రి వర్గానికి ఉంటుంది. దాన్ని మేం చట్టపరంగానే ఎదుర్కొంటాం' అని అన్నారు.

పకడ్బందీ ఆధారాలతో దర్శన్‌పై ఛార్జిషీట్ దాఖలు

బెంగళూరు: రేణుకాస్వామికి చిత్రహింసలు, హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్ తూగుదీపపై బుధవారం ఛార్జిషీటు దాఖలైంది. ఇప్పటికే ఈ కేసులో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో పోలీసులు దాదాపు 200కు పైగా ఆధారాలను దర్శన్‌కు వ్యతిరేకంగా సేకరించారు. దర్శన్, ఇతర నిందితుల నుంచి స్వాధీనం చేసుకొన్న రక్తపు మరకలున్న దుస్తుల ఫోరెన్సిక్ నివేదికలు ఉన్నాయి. నేరం జరిగిన ప్రదేశం ఫొటోగ్రాఫ్‌లు, దర్శన్ సీసీటీవీ దృశ్యాలు, అతడి స్నేహితురాలు పవిత్రగౌడ వద్ద నుంచి స్వాధీనం చేసుకొన్న రక్తపు మరకల చెప్పులను స్వాధీనం చేసుకున్నారు. రేణుకాస్వామిని నిందితులు అత్యంత పాశవికంగా కొట్టినట్లు తేలింది. రేణుకాస్వామికి కరెంట్‌షాకులు పెట్టినట్లు పోస్టుమార్టం నివేదిక పేర్కొంది. శరీరంపై కాల్చిన ఆనవాళ్లు, చెవి భాగం కత్తిరించడం, అతడి మర్మాంగాలపై గాయాలు వంటివి హత్య తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఈ కేసులో దర్శన్, పవిత్రగౌడ సహా 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న దర్శన్‌ను... బెంగళూరు న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇటీవలే బళ్లారి జైలుకు తరలించారు.

పార్టీ మారితే పెన్షన్ నిలిపివేత

హిమాచల్ ప్రభుత్వం నిర్ణయం

సిమ్లా: పార్టీ ఫిరాయింపులపై హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీలు మారిన ఎమ్మెల్యేలకు పెన్షన్ సదుపాయాన్ని నిలిపివేయనుంది. దీనికి సంబంధించిన సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ బుధవారం ఆమోదం తెలిపింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు ఎదుర్కొన్న ఎమ్మెల్యేలకు ఈ కొత్త నిబంధన వర్తించనుంది. ఫిరాయింపులను అరికట్టేందుకు హిమాచల్‌ప్రదేశ్ శాసనసభ (సభ్యుల పింఛన్లు, అలవెన్సులు) సవరణ బిల్లు - 2024ను ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు మంగళవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం బుధవారం ఓటింగ్ నిర్వ హించి... ఈ బిల్లును శాసనసభ ఆమో దించింది. 'ఏదైనా ఒక సమయంలో ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటు ఎదుర్కొన్న శాసనసభ్యులు ఇకపై పింఛను పొందే వెసులుబాటు ఉండదు' అని ఈ బిల్లులో పేర్కొన్నారు. హిమాచల్‌ప్రదేశ్ చట్టాల ప్రకారం ఐదేళ్ల కాలం పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన శాసనసభ్యులకు నెలకు రూ.36 వేల పింఛను ఇస్తున్నారు.

అందరి భాగస్వామ్యం అవసరం

- తక్షణ సాయంగా రూ.20 వేలు
- వాణిజ్య పంటలకు రూ.లక్ష ఇవ్వాలి
- వరద ప్రాంతాల సందర్శనలో రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు/ నందిగామ: వరద విపత్తును జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలనీ, వరద సహాయక చర్యల్లో అన్ని రాజకీయ పార్టీలను ముఖ్యమంత్రి భాగస్వామ్యం చేయాలనీ, వరద బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.20 వేలు అందించాలనీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు, ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలంలో వరదకు దెబ్బ తిన్న అరటి తోటను, కొట్టుకుపోయిన పంట పొలాలను రామకృష్ణ, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు బుధవారం పరిశీలించి బాధితులను పరామర్శించారు, ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అధికారులు సమన్వయ లోపంతో వరద ఉధృతిని అంచనా వేయలేకపోవడంతో ప్రజాజీవనం స్తంభించిందని అన్నారు, పెనుగ్రంచిపోలు, ముచ్చింతల వద్ద మునేరు గండిని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాంతో కలసి పరిశీలించి పంట నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు, వరద వల్ల నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు చొప్పున, ఇతర పంటలకు తక్షణసాయంగా 30 వేల రూపాయలు అందజేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. భూ ఆక్రమణల ఫలితంగానే బుడమేరు వరద సంభవించిందని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అక్రమాలపై దృష్టి సారించాలన్నారు. వరద సహాయక చర్యల్లో సీపీఐ శ్రేణులు పాల్గొంటున్నారని తెలిపారు. ఇప్పుడు పరిశీలించిన అరటి తోట పూరిగ్గా దెబ్బతిన్నదని. ఈ రైతు10 ఎకరాలు వేస్తే వరదకు కొట్టుకు పోయిందనీ, రూ. 34 లక్షలు నష్టం వాటిల్లివుంటుందన్నారు. అలాంటి వారికి ఎకరానికి లక్ష రూపాయాలు చొప్పున పరిహారం ఇవ్వడంతోపాటు బీమా ద్వారా ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకొని వరద బాధితులను ఆదుకోవాలని రామకృష్ణ సూచించారు. నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ మాట్లాడుతూ పెనుగంచిప్రోలు నుంచి ముచ్చింతాల వెళ్లే రోడ్డు పూర్తిగా తెగిపోయిందన్నారు. వరదకు కొట్టుకు పోయిన పొలాలను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారని చెప్పారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ బెజవాడ దుఃఖ దాయినిగా బుడమేరు, ఖమ్మం దుఃఖ దాయినిగా మున్నేరు ఉందన్నారు. వరద ముంపునకు గురైన ప్రజలను ఆదుకోవాలనీ, వరి రైతుకు 30 వేలు. మిర్చి, పత్తి రైతుకు 50 వేలు చొప్పున ఆర్థిక సహాయం ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వల్లంకొండ బ్రహ్మం, టీడీపీ మండల అధ్యక్షులు చింతల. సీతారామయ్య, తిరువూరు నియోజకవర్గం పరిశీలకులు గింజుపల్లి. రమేశ్, తెలుగు రైతు సంఘం అధ్యక్షులు. కర్ల నాగేశ్వర రావు. సీపీఐ నందిగామ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు, మాజీ ఎంపీపీ పొన్నం నరసింహారావు, పద్మాల. వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆహారం చెత్తబుట్టపాలు

బాధితుల అవస్థలు వర్ణనాతీతం

విశాలాంధ్ర- విజయవాడ: వరద బాధితుల జీవనం అస్తవ్యస్తంగా మారింది. తినడానికి తిండి, తాగడానికి నీరు అవసరం మేర అందుబాటులో లేకపోవడంతో దీనావస్థలో ఉన్నారు. ప్రణాళికాబద్ధంగా అధికారులు వ్యవహరించకపోవడం, సమన్వయం కొరవడటంతో ఆహారపదార్థాలు చెత్తకుండీ పాలయ్యాయి. పాచికంపు కొడుతుండడంతో సింగ్‌నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపైనే గుట్టలుగుట్టలుగా పడేశారు. పీకల్లోతు నీళ్లలో సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వద్దకు చేరుకోవడం అతికొద్దిమందికే సాధ్యమని, కొట్టుకుపోతామనే భయంతో వేలాదిమంది ప్రజలు ఇంటికే పరిమితమయ్యామని, ప్రచారం గావించి ఇళ్ల వద్దకు కాకపోయినా నాలుగురోడ్ల కూడలి వద్ద ఆహార పొట్లాలు, మంచినీళ్లు, పిల్లలకు పాలు అందజేస్తే ప్రయోజనకరంగా ఉండేదని బాధితులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. పంపిణీ అస్తవ్యస్తంగా ఉందని, అందినోళ్లు అందినంత పట్టుకుపోయారని, ఎగబడుతున్న గుంపును ఛేదించుకొని పావులీటర్ పాల ప్యాకెట్ కూడా దక్కించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వ ఆహారం ప్యాకెట్లు పంచి పెట్టారని, అది కంపుకొడుతుండడంతో అక్కడే పారేశామని మరికొందరు దీనంగా చెప్పారు. ఒక దశలో తండోపతండాలుగా వస్తున్న జనాలను నియంత్రించడం పోలీసులకు కష్టతరంగా మారింది. సమన్వయం లేకపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరించడంతో వేలాదిమందికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహాయం అందకుండా పోయింది. ఇదిలా ఉండగా బుధవారం మరో ఉపద్రవం రానుందన్న ప్రచారంతో ప్రాణాలు అరచేత పట్టుకుని కొందరు ఇంటికే పరిమితం కాగా... మరికొందరు మూటాముల్లె సర్దుకుని అయినవాళ్ల ఇళ్లకు పయనమయ్యారు.

ఒక్కో పంచాయతీకి రూ.లక్ష విరాళం

ఇళ్లలో కూర్చొని విమర్శలొద్దని వైసీపీకి పవన్ హితవు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ నేతలు ఇళ్లలో కూర్చుని విమర్శలు చేయడం సరికాదని, విపత్తు సమయంలో సహాయ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. బుధవారం అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు, వరదలకు భారీ నష్టం జరిగిందన్నారు. పంటలు, రోడ్లు తీవ్రంగా నష్టపోయినట్లు వివరించారు. ఏపీలో 3,312 కి.మీ మేర రోడ్లు కొట్టుకుపోయాయని తెలిపారు. 1.69 లక్షల ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు నష్టపోయినట్లు వెల్లడించారు. 18,424 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖకు సంబంధించిన 233కి.మీ. మేర రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వరదల కారణంగా మత్స్యకారులకు చెందిన సుమారు 60 పడవలు దెబ్బతిన్నట్లు పవన్ తెలిపారు. బుడమేరులోని 90 శాతం ఆక్రమణలే విజయవాడకు శాపంగా మారాయని పవన్ అన్నారు. ఇలాంటి పరిస్థితిలో సీఎం చంద్రబాబు సమర్థవంతంగా పని చేస్తున్నారని కొనియాడారు. ఆయనను అభినందించాల్సిందిపోయి విమర్శలు చేయడం సరికాదని వైసీపీ నేతలకు హితవు పలికారు. ముందు వైసీపీ నేతలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. తాను వెళితే సహాయ చర్యలకు ఇబ్బంది కలుగుతుందని, అధికార యంత్రాంగానికి ఒత్తిడి ఉంటుందని చెప్పడంతో తాను వెళ్లలేదని అన్నారు. మొత్తం 400 గ్రామ పంచాయతీలు వరద ముంపు బారిన పడ్డాయని, ఒక్కో పంచాయతీకి లక్ష రూపాయల చొప్పున నేరుగా పంచాయతీ ఖాతాకు విరాళం పంపిస్తానని ప్రకటించారు. రూ.4 కోట్ల మొత్తాన్ని ముంపు గ్రామ పంచాయతీలకు అందించాలని నిర్ణయించుకున్నట్టు ఆయన తెలిపారు. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.కోటి విరాళం అందించనున్నట్టు పవన్ కల్యాణ్ వెల్లడించారు. కాగా, పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో వరద పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులు, గ్రామాలలో తాగునీరు, ఆహారం సరఫరా, పారిశుధ్య నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముంపు గ్రామాల ప్రజలకు అవసరమైన ఆహారం, తాగు నీరు, ఔషధాలు సిద్ధం చేసే విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని పవన్ సూచించారు.ఖ

చిత్తశుద్ధి లేకపోవడమే అసలు సమస్య

'అపరాజిత బిల్లు'పై అనీ రాజా

న్యూఢిల్లీ: సమస్య చట్టం లేకపోవడం వల్ల కాదనీ, చట్టం అమలులో చిత్తశుద్ధి కొరవడమేనని సీపీఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా అన్నారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారానికి గురై దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన వైద్యుల ఆందోళనల నేపథ్యంలో మమతా బెనర్జీ ప్రభుత్వం 'అపరాజిత బిల్లు'ను తీసుకొచ్చింది. లైంగిక దాడికి పాల్పడిన వారికి జీవితఖైదు విధించేలా రూపొందించిన ఈ బిల్లు మంగళవారం అసెంబ్లీలో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై అనీ రాజా స్పందిస్తూ, 'చట్టాలను రూపొందించినా వాటిని పకడ్బందీగా అమలు చేయకపోవడమే దేశంలో ప్రధాన సమస్య. మహిళల గౌరవాన్ని కాపాడేందుకు భారత పార్లమెంట్ ఎన్నో చట్టాలను ఆమోదించింది. మీడియాలో ఏ అంశం ప్రధానంగా వెలుగు చూసినా ఆపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది. దాన్ని నియంత్రించడం కోసం మనం కొత్త చట్టాలను చేయడమో, లేదా...ఉన్న చట్టాలను సవరించడమో చూస్తుంటాం. అయితే, చేసిన చట్టాలను సరిగ్గా అమలు చేయకపోవడమే అసలు సమస్య. చట్టాల అమలుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు రాష్ట్రాలకు లేకపోవడం మరో ప్రధాన అవరోధం' అని ఆమె అన్నారు.

దేశంలో ప్రస్తుతం ఉన్న మహిళా, శిశు రక్షణ చట్టాల అమలులో చిత్తశుద్ధి కొరవడిందని అనీ రాజా విమర్శించారు. మహిళ భద్రత, గౌరవాన్ని కాపాడేందుకు దేశంలో అనేక చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన అమలు, తగినంత బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వల్ల ఇటువంటి చట్టాలలో మార్పులు చేసినా కొద్ది రోజులకే మౌనందాలుస్తున్నాయని సీపీఐ నేత అన్నారు.

ఆ 11 గేట్లు కొంపముంచాయి

అంధకారంలో గ్రామాలు... భయాందోళనలో ప్రజలు

విశాలాంధ్ర- విజయవాడ: వెలగలేరు రెగ్యులేటర్ 11 గేట్లు ఒక్కసారిగా ఎత్తివేయడం వల్లనే వరద కట్టలు తెంచుకుని తమ గ్రామాలను ముంచెత్తిందని ఆయా గ్రామాల ప్రజలు గొల్లుమంటున్నారు. ఉప్పెనలా విరుచుకుపడటంతో ఇళ్లు మునిగిపోవడమేగాక మూగజీవాలు చెల్లాచెదురయ్యాయని బోరున విలపిస్తున్నారు. వరద ఉగ్రరూపం దాల్చడంతో చెట్టుకొకరు, పుట్టకొకరు అన్న చందాన తమ కుటుంబాలు చెల్లాచెదురయ్యాయని కన్నీటిపర్యంతమయ్యారు. విశాలాంధ్రతో బుధవారం తమ దీనస్థితిని బాధితులు వెళ్లబోసుకున్నారు. ఇంతటి భయానక రాత్రిళ్లు ఎప్పుడూ గడపలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలతెలవారుతుండగానే క్షణాల్లో ఉవ్వెత్తున వరదనీరు ఎగసిపడటంతో గుండెలు ఆగిపోయాయన్నారు. తిండిలేక... గుక్కెడు మంచినీళ్లు దొరక్క రెండు రోజులపాటు ప్రాణాలు అరచేత పట్టుకుని బతుకుజీవుడా అంటూ చీకట్లో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చిందన్నారు. ఓవైపు పాముల భయం, మరోవైపు నీటిలో కొట్టుకొస్తున్న శవాలతో పైప్రాణాలు పైనే పోయాయన్నారు. కౌలూరు- వెలగలేరు నడుమ గట్లు కొట్టుకుపోవడం ఒక్కసారిగా ఉగ్రగంగ ఊళ్లమీద పడినట్టు చెప్పారు. తెలంగాణ, తిరువూరు, మైలవరం తదితర ఎగువ ప్రాంతాల నుంచి భారీ వర్షాలకు రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహం పొంగిపొర్లుతోందని, కనీసం సగం గేట్లు తెరిస్తే కొంతవరకైనా మెరుగ్గా ఉండేదని, ఒకేసారి తెరవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని బాధితులు చెప్పారు.

సహాయ నిధికి విరాళాల వెల్లువ

ఉద్యోగుల సాయం రూ.120 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో వరద బాధితులను ఆదుకునేందుకు ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు భారీ విరాళం ప్రకటించారు. ఉద్యోగుల సెప్టెంబరు నెల జీతంలో ఒక రోజు బేసిక్ పే ద్వారా రూ.120 కోట్లు సీఎం సహాయనిధికి విరాళం ఇస్తున్నట్లు వెల్లడించారు. పెన్షనర్లు కూడా ఈ విరాళంలో భాగమైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అంగీకార పత్రాన్ని జేఏసీ నేతలు కె.వి.శివారెడ్డి, విద్యాసాగర్ తదితరులు బుధవారం సీఎం చంద్రబాబును కలిసి అందజేశారు. వరద సహాయం నిమిత్తం మొత్తం 8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు విరాళం అందించారు.



సినీ ప్రముఖుల భారీ విరాళాలు

రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు, వరదలకు ఇళ్లు, పొలాలు ముంపునకు గురయ్యాయి. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. వరద ప్రభావిత ప్రజలను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో విరివిగా విరాళాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు అనేక మంది వ్యక్తులు, సంస్థలు, ప్రముఖులు విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కల్యాణ్ ఏపీ, తెలంగాణాకు కోటి రూపాయల వంతున సహాయం ప్రకటించడంతో పాటు వరద ప్రభావానికి గురైన 400 పంచాయతీలకు రూ.లక్ష వంతున నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి వేస్తానని ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఏపీ, తెలంగాణకు కోటి వంతున విరాళం అందించారు. మెగాస్టార్ చిరంజీవి, అల్లు అర్జున్, రామ్ చరణ్, బాలకృష్ణ, మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్ ఒక్కో రాష్ట్రానికి రూ.50 లక్షలు విరాళంగా ప్రకటించారు. అక్కినేని కుటుంబం రూ.50 లక్షల చొప్పున రెండు రాష్ట్రాలకు విరాళం ప్రకటించారు. ప్రభాస్ రెండు రాష్ట్రాలకు కోటి వంతున విరాళం ఇచ్చారు. వీళ్లతో పాటు జొన్నలగడ్డ సిద్దూ రూ.30 లక్షలు, విశ్వక్ సేన్, వెంకీ అట్లూరి రూ.10 లక్షలు, అనన్య నాగళ్ల రూ.2.5 లక్షలు, వైజయంతీ మూవీస్ రూ.25 లక్షలు, ఆలీ మూడు లక్షల చొప్పున విరాళం ప్రకటించారు.

జస్టిస్ ఎన్వీ రమణ విరాళం

సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ తన వంతుగా రెండు తెలుగు రాష్ట్రాలకు విరాళం అందించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెరో రూ.10 లక్షల చెక్కులను ఢిల్లీలో రెసిడెంట్ కమిషనర్లకు అందించారు. ఈ సందర్భంగా ఎన్వీ రమణ మీడియాతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఉదారంగా సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం పిలుపునకు భారీ స్పందన

వరద ప్రభావిత ప్రజలను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో విరివిగా విరాళాలు అందించాలన్న సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు అనేక మంది వ్యక్తులు, సంస్థలు విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం విజయవాడ కలెక్టరేట్ వద్ద ముఖ్యమంత్రిని కలిసి పలువురు విరాళాలు అందించారు. బీఎస్ఆర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఎండీ బలుసు శ్రీనివాసరావు రూ.లక్ష కోటి, సినీ నిర్మాత అశ్వనీదత్ రూ.25 లక్షలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రూ.25 లక్షలు (ఆంధ్రప్రదేశ్), సిద్ధార్థ వాకర్స్ క్లబ్ రూ.5 లక్షలు (విజయవాడ) చొప్పున ఇచ్చారు. టీడీపీ మహిళా నాయకురాలు రాయపాటి శైలజ రూ.5 లక్షలు (గుంటూరు), డాక్టర్ ఐ.నళినీ ప్రసాద్ రూ.లక్ష (విజయవాడ), పొట్లూరి విజయ్ కుమార్ రూ.లక్ష (విజయవాడ), అల్లూరి అచ్యుతరామరాజు రూ.లక్ష (కైకలూరు), వల్లభనేని రవి రూ.లక్ష విరాళం సీఎం చంద్రబాబుకు ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత చెక్కులు, నగదును సీఎంను కలిసి ఇచ్చారు. విపత్కర పరిస్థితుల్లో బాధితుల పక్షాన నిలిచేందుకు సీఎం సహాయ నిధికి తమవంతు సాయం అందించామని దాతలు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపుతో ముందుకొచ్చి తమ దాతృత్వాన్ని చాటుకొని విరాళాలు అందించినందుకు దాతలకు చంద్రబాబు ధన్యవాదాలు తెలియజేశారు.

వరద సాయం ఎక్కడ?

- కేంద్రాన్ని నిలదీసిన ఏఐకేఎస్
- వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్

న్యూఢిల్లీ: వివిధ రాష్ట్రాల్లో వరదలకు అపారనష్టం సంభవించినప్పటికీ కేంద్రప్రభుత్వం తగు విధంగా స్పందించకపోవడాన్ని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) తప్పుబట్టింది. వివిధ రాష్ట్రాల్లో వరద ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించి... బాధితుల సహాయ, పునరావాస కార్యక్రమాలకు తక్షణం నిధులు విడుదల చేయాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, అసోం తదితర ప్రాంతాల్లో అధిక వర్షాల కారణంగా భారీగా వరదలు సంభవించి... చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల మంది నిర్వాసితులయ్యారు. లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో పాటు పశు సంపద నష్టపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చాలా మంది ప్రజలు ఇప్పటికీ ఉండటానికి ఇల్లు లేక, తినడానికి తిండి లేక అల్లాడుతున్నారు. విపత్కర పరిస్థితిలో ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం... తక్షణ చర్యలకు నిధులు విడుదల చేయడం కానీ, సహాయ పునరావాస కార్యకలాపాల కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించడం కానీ చేయలేదు. కార్పొరేట్ల దురాశ, అభివృద్ధి పేరుతో అశాస్త్రీయ కార్యకలాపాల కారణంగానే ఈ ప్రకృతి వైపరీత్యాలు మరింత తీవ్రమయ్యాయని ఏఐకేఎస్ దుయ్యబట్టింది. వరద పరిస్థితిలో ప్రజల జీవితాలను, జీవనోపాధిని కాపాడేందుకు సహాయం చేయడం కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ బాధ్యత. ఇటీవలి వయనాడ్ విపత్తు సందర్భంగా నరేంద్రమోదీ కేరళ ప్రజల పట్ల నేరపూరిత నిర్లక్ష్యానికి పాల్పడ్డారు. అలాంటి సమయంలో మన ప్రధాని సింగపూర్‌లో తన డోలు వాయించే నైపుణ్యాలను ప్రదర్శించడంలో తీరికలేకుండా ఉన్నారని ఎద్దేవా చేసింది. ఏపీ, తెలంగాణ, బీహార్‌లో వరద ప్రభావిత ప్రాంతాలు, సహాయక చర్యలను ఏఐకేఎస్ రాష్ట్ర బృందాలు పరిశీలించాయి. సహాయ కార్యక్రమాల్లో సైతం చురుగ్గా పాల్గొంటున్న ఏఐకేఎస్... తక్షణం చేపట్టాల్సిన చర్యలపై కేంద్రప్రభుత్వం ఎదుట ఉంచిన డిమాండ్లు ఈ విధంగా:

- ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, అసోం సహా దేశంలోని ఇతర ప్రాంతాలలో వరద పరిస్థితిని జాతీయ విపత్తుగా ప్రకటించాలి.
- వరద బాధితుల సహాయక చర్యలకు నిధుల విడుదల చేయాలి.
- విపత్తు సహాయం విషయంలో కేంద్ర ప్రభుత్వం రాజకీయ పక్షపాతం లేకుండా అన్ని రాష్ట్రాలపట్ల ఒకే విధంగా స్పందించాలి.
- మృతుల కుటుంబాలకు కనీసం రూ.కోటి ఆర్థిక సాయం ప్రకటించాలి.
- బాధితులు సహాయ ప్రయోజనాలను పొందేలా సహాయ శిబిరాలను ఏర్పాటు చేయడానికి నిధులు అందించాలి.
- బాధిత కుటుంబాల పశువులకు ప్రభుత్వం మేత అందించాలి.
- పంట నష్టానికి సంబంధించి ఎకరాకు ఆహార పంటకు కనీసం రూ.50 వేలు, వాణిజ్య పంటలకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలి.
- కేంద్రం కౌలు రైతులు, భాగస్వామ్యదారులు మరియు గ్రామీణ కార్మికుల ఉపాధి నష్టాన్ని కనీసం 3 నెలలపాటు కూలితో భర్తీ చేయాలి.
- పంటల బీమా పథకం 'పీఎంఎఫ్‌బీవై' కింద పంట నష్టాలకు పూర్తి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలి -వరద బాధిత రైతులకు రుణమాఫీని ప్రకటించాలి
- తదుపరి సాగు కోసం విత్తనాలు, ఎరువులతో పాటు బ్యాంకుల నుండి కొత్త రుణాలను అందించాలి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.